జన రాజకీయం కోసం ...

₹ 10/-

# లోక్‌సత్తా టైమ్స్

సంపుటి- 6 సంచిక - 24 పక్షపత్రిక డిసెంబర్ 16-31, 2015



## సాంప్రదాయ రాజకీయ నేతలకు సవాలు
## రోబో లీడర్లు

లోక్‌సత్తా పార్టీ



మన పిల్లలకి చదువు చెప్పించుకోవాలంటే
భారమైనా బాగా చెప్పే ఉపాధ్యాయుని వద్దకే పంపుతాం

మన కుటుంబంలో వైద్యం కావాలంటే
దూరమైనా తెలుసుకుని మరీ మంచి వైద్యుని వద్దకు వెళతాం

మరి మన జీవితాల్ని మార్చే రాజకీయాలలో మాత్రం ఎందుకు
కులం, మతం, ప్రాంతం, భాష వంటి సంకుచిత భావాలతో
పనికిమాలినవాళ్లను ఎన్నుకుంటున్నాం?

– డా॥ జయప్రకాష్ నారాయణ్

జన రాజకీయం కోసం...

**లోక్‌సత్తా టైమ్స్**

పక్షపత్రిక డిసెంబర్ 16-31, 2015

సంపుటి - 6 సంచిక - 24

## లోపలి పేజీల్లో...

డ్రామాలు తప్ప అవినీతి అంతానికి వ్యవస్థీకృత.......... 5
లోక్‌సత్తాని రాజకీయ శక్తిగా మలచాలి........................ 6
ప్రాణిహిత-చేవెళ్లలాంటి ప్రాజెక్టులతో.......................... 7
ప్రత్యేక హోదాపై దగా................................................... 8
ఇంకుడుగుంతల కోసం వసూలుచేసిన డబ్బుఏమైంది. 9
స్వచ్ఛ హైదరాబాద్ ప్రచారంలోని కాలష్యాన్ని బైట....... 10
పూలే భావాలకు రాజకీయ వేదిక లోక్‌సత్తా................. 11
వీధికుక్కల్ని అరికట్టటంలో జీహెచ్‌ఎంసీ విఫలం.......... 12
కరువు మండలాల సంఖ్య పెంచాలి : లోక్‌సత్తా.......... 13
సాంప్రదాయ రాజకీయ నేతలకు సవాల్ రోబోలీడర్లు.. 14
ఆడపిల్లను బతకనిద్దాం... ఎదగనిద్దాం......................... 18
వైవాహిక రేప్ క్రిమినల్ నేరం కాదన్న ప్రకటనను .......... 20
ప్రజల పన్నుల డబ్బు ఏమవుతోంది : కమల్ ఆవేదన...... 21
పునాదిస్థాయిలోనే పగుళ్లు............................................ 22
దోపిడీ నైపుణ్యాల అభివృద్ధి విధానం............................ 24
నివారించదగ్గ బాధల్ని తొలగించటంలో ...................... 26
పెద్దల పాత్ర పరిమితమైతేనే ప్రజాభిప్రాయానికి .......... 28
మనం సద్వినియోగం చేసుకోలేకపోయిన 2015 ... 32
హిజ్రాలకు రేషన్ కార్డులివ్వండి..................................... 34
పని చేయనివారు, పార్టీలు ఫిరాయించిన వారు..... 34

### సంపాదక వర్గం

డా॥ జయప్రకాష్ నారాయణ్
ప్రధాన సంపాదకులు

### సంపాదక వర్గం

బండారు రామ్మోహన్‌రావు
డా॥ ఆలూరి విజయలక్ష్మి
కె.వి. కుటుంబరావు

బుక్ & కవర్ డిజైన్ : సునీత ఆలిమిల్లి

# రాజ్యసభ అధికారాలను తగ్గించాలి, సభ్యుల ఎంపికనూ సంస్కరించాలి



రాజ్యసభ అధికారాలను నియంత్రించాలంటూ వ్యాసం రాసినందుకు బీజేడీ ఎంపీ జే పాండాకి కొందరు ప్రతిపక్ష రాజ్యసభ ఎంపీలు సభా హక్కుల తీర్మానం ఇవ్వటం అర్థరహితం. అయితే ఈ రూపంలోనైనా రాజ్యసభ పాత్రపై చర్చ వస్తే స్వాగతిద్దాం.

ప్రజలు ఎన్నుకున్న లోక్‌సభను పనిచేయకుండా చేస్తున్న రాజ్యసభ అధికారాలను పునస్సమీక్షించి తగ్గించాలని 1990ల కాలం నుంచి నేను పలుమార్లు బహిరంగంగానే చెప్పాను. జే పాండా అభిప్రాయాలను పూర్తిగా సమర్థిస్తున్నా. ఇటీవల గోవాలో జరిగిన ఓ సదస్సులో ఆయనతో ఈ అంశాల్ని చర్చించాను కూడా. రాజ్యసభ ఆగ్రహిస్తే ప్రజల్లో అవగాహన పెంచే ఒక అవకాశంగా భావించి సంతోషంగా ఎదుర్కొంటా. ప్రజలు ఎన్నుకున్న లోక్‌సభ ఎజెండాను రాజ్యసభ అడ్డుకోలేదు. కేవలం పార్టీ రాజకీయాల కారణంగా 1977 నుంచి వివిధ ప్రభుత్వాలు రాజ్యసభ వీటో కోరల్లో చిక్కుకుంటున్నాయి. మన రాజ్యసభ తరహాలోనే బ్రిటన్‌లో లార్డ్స్ సభ 'ప్రజల బడ్జెట్'ని తిరస్కరిస్తుంటే, 1909-11లో అప్పటి ప్రభుత్వంలో ఉన్న లాయిడ్ జార్జి ఆ సభ అధికారాలను కుదించారు. రాజ్యసభ సంస్కరణలు మాత్రం చాలా కాలంగా పెండింగ్‌లోనే ఉన్నాయి. రాజ్యసభ రాష్ట్రాల మండలి, అది ప్రధానంగా రాష్ట్రాల అంశాలపై దృష్టి పెట్టాలి. రాష్ట్రాలు ఆరేళ్ల క్రితం ఎన్నుకున్న సభ్యులకు రాజ్యసభ ప్రాతినిధ్యం వహిస్తోంది తప్ప ఈవేళ ప్రజల మనోభావాలకు అద్దం పట్టటం లేదు. జర్మనీలోని ఎగువసభ (బుండెస్టాగ్) ఎప్పటికప్పుడు ప్రజాభిప్రాయాన్ని ప్రతిబింబిస్తుంటుంది. రాష్ట్ర ప్రభుత్వాలు మారితే అక్కడ కొత్త సభ్యుల్ని ఎన్నుకుంటారు. ఈ నేపథ్యంలో రాజ్యసభ పనితీరునే కాకుండా సభ్యుల ఎన్నికను కూడా సంస్కరించాలి. మనం భావోద్వేగాలు, భారీ ఖర్చుతో ఎంతో ఆర్భాటంగా ప్రభుత్వాల్ని ఎన్నుకుంటాం. కానీ అవి పనిచేసే అవకాశాన్ని గురించి మాత్రం ఆలోచించం. దాంతో ప్రతి ఒక్కరూ తమ వైఫల్యాలకు ఏదోక వంకలు చెబుతూ తప్పించుకుంటున్నారు. మనం మేలుకోవటమే పరిష్కారం.

## వాతావరణ కాలుష్య నియంత్రణపై పారిస్‌లో ప్రపంచ దేశాల ఏకాభిప్రాయం, ఆచరణ ప్రణాళికలో మాత్రం అస్పష్టత




# కార్టూన్ కార్నర్

## రచనలు పంపండి

'లోక్‌సత్తా టైమ్స్' పత్రికలో ప్రచురణ కోసం వ్యాసాలు, గేయాలు, కార్టూన్‌లు, ఉత్తరాలు ఈ కింది చిరునామాకు పంపండి.

**ఎడిటర్, లోక్‌సత్తా టైమ్స్,**
తులిప్స్ అపార్ట్‌మెంట్స్
6-3-655, ఫ్లాట్ నెం. 407
సివిల్ సప్లయిస్ ఆఫీస్ వెనుక
సోమాజిగూడ, హైదరాబాద్ – 500 082

**ఫోన్ : 040-23310288**
**ఫోన్ / ఫ్యాక్స్ : 040-23311816**

accountsdept@loksatta.org
loksattatimeslsp@gmail.com

## చందా వివరాలు

జన రాజకీయ వాణి 'లోక్‌సత్తా టైమ్స్' పత్రిక చందాదారులుగా చేరండి... చేర్పించండి. సంప్రదించవలసిన ఫోన్ నం: **040-23311816**

*విడి ప్రతి : రు. 10 ,*
*ఏడాది చందా : రు. 200*
*మూడేళ్ళ చందా : రు. 500*

చందా రుసుమును "లోక్‌సత్తా టైమ్స్" ఎకౌంట్ నం: *62007167836* ఎస్.బి.హెచ్., పంజాగుట్ట బ్రాంచ్, హైదరాబాద్ పేరిట ఆన్‌లైన్ క్రెడిట్ చేసి వివరాలను ఇ-మెయిల్ చెయ్యవచ్చు.


## లోక్‌సత్తా ప్రకటన రేట్లు

| | బ్లాక్ & వైట్, | మల్టీకలర్ |
|---|---|---|
| సగం పేజీ | ₹ 2,500 | |
| పూర్తి పేజీ | ₹ 5,000 | ₹ 10,000 |
| సెంటర్ స్ప్రెడ్ | ₹ 10,000 | ₹ 20,000 |
| బ్యాక్‌పేజి | - | ₹ 20,000 |
| ఫ్రంట్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |
| బ్యాక్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |

♦ ప్రకటన రుసుము Loksatta Times పేరిట హైదరాబాద్‌లో చెల్లుబాటు అయ్యే విధంగా చెక్/డిడి రూపంలో పంపగలరు.

# డ్రామాలు తప్ప అవినీతి అంతానికి వ్యవస్థీకృత ఏర్పాట్లేవీ?: జేపీ

అవినీతి వ్యతిరేక పోరాటం పేరుతో డ్రామాలు తప్ప అవినీతి అంతానికి కావలసిన బహుముఖ వ్యవస్థల నిర్మాణాన్ని మాత్రం జాతీయస్థాయిలోనూ, రాష్ట్రాల్లోనూ పాలకులు చేయటంలేదని లోక్‌సత్తా పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. లోక్‌పాల్ సహా ఏ ఒక్క చట్టమో మంత్రదండం కాదన్నారు. నల్లధనం విషయంలో, తెలుగునాట ఓటుకు కోట్లు విషయంలో పాలకుల తీరు చూస్తే అవినీతిపై పోరులో మాటలకి, చేతలకి ఎంత అంతరముందో తెలుస్తుందన్నారు. డిసెంబర్ 9న అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దినం సందర్భంగా లోక్‌సత్తా పార్టీ నేతలు జయప్రకాష్ నారాయణ్‌ని కలిసి అవినీతి నిర్మూలనకు పౌరసమాజంలో, పాలనా వ్యవస్థలో, రాజకీయాల్లో సుదీర్ఘకాలంగా వ్యవస్థీకృత కృషి చేస్తున్నందుకు అభినందనలు తెలియచేశారు. తమ వంతు క్రియాశీల మద్దతును పునరుద్ఘాటించారు.



జేపీ మాట్లాడుతూ, అవినీతిని నిరోధించే ఏర్పాట్లు చేయాల్సిన ఏసీబీలు, కలెక్టరేట్‌లు, మునిసిపల్ సంస్థలు ఆ పని చేయకుండా అవినీతి వ్యతిరేక దినం సందర్భంగా మొక్కుబడి వారోత్సవాలకు పరిమితమవటం ప్రజలను మోసం చేయటమేనన్నారు. నిజాయతీలో మన ప్రజలు ప్రపంచంలోని ఏ అభివృద్ధి చెందిన దేశంతోనూ తీసిపోరని, ప్రభుత్వాలు ప్రజలకు నీతులు బోధించటం ఆపి నిజాయతీకి ప్రోత్సాహాన్నిచ్చే పాలనను అందించాలని అన్నారు. అవినీతి నిరోధక వ్యవస్థల నిర్మాణంపై పాలకుల కళ్లు తెరిపించటం ఇప్పుడు ముఖ్యమన్నారు.

పెట్రోల్ బంకుల తూనికలలో అక్రమాలను బైటపెట్టేందుకు 1998లో లోక్‌సత్తా అవగాహన, చిత్తశుద్ధితో చేసిన చిన్న ప్రయత్నం వల్ల దేశవ్యాప్తంగా 85శాతం తూనికల అక్రమాలు సరయ్యాయని, తద్వారా ఇన్నేళ్లలో కనీసం రూ.2లక్షల కోట్ల మేర ఈ దేశ ప్రజలకు ప్రయోజనం చేకూరిందని జేపీ వివరించారు. అక్కడ్నుంచి మొదలుపెట్టి సమాచార హక్కు చట్టం (ఆర్‌టీఐ), ఢిల్లీ నుంచి జిల్లా దాకా లోక్‌పాల్–లోకాయుక్త–అంబుడ్స్‌మన్‌ల వ్యవస్థ, రాజకీయ పార్టీలకిచ్చే నిజాయతీ విరాళాలకు పన్ను రాయితీ, ఎన్నికలలో అభ్యర్థులు తప్పనిసరిగా వివరాలు ప్రకటించేలా చేయటం, స్థానిక న్యాయాలయాల చట్టం, ఉన్నత న్యాయమూర్తుల నియామకాలకు జ్యుడీషియల్ కమిషన్, 2 జీ స్పెక్ట్రం అక్రమాలపై కేసుతో బొగ్గు, ఇనుము తదితర ప్రకృతి వనరుల కేటాయింపు బహిరంగ వేలం ద్వారానే జరిగేలా చేయటం, ఏసీబీలకు జవాబుదారీతనంతో కూడిన స్వయంప్రతిపత్తి, ప్రభుత్వ కార్యాలయాల్లో హక్కుగా పౌరసేవలకు 'సర్వీస్ గ్యారంటీ' చట్టం, స్థానిక సాధికారత, తలసరి నిధుల కేటాయించి ప్రజల భాగస్వామ్యంతో గ్రామ, మునిసిపల్ వార్డు స్థాయిలో పనులు వంటి బహుముఖ కృషితో అవినీతి నిరోధానికి లోక్‌సత్తా కృషి చేస్తోందని, ప్రజల్లో అవగాహన పెంచటంతోపాటు అధికారంలో ఉన్నవారి కంటే గణనీయ ఫలితాలను సాధించి చూపిందని అన్నారు. కానీ లోక్‌సత్తా చెప్పిన పరిష్కారాన్ని ఎన్నికైన సాంప్రదాయ ప్రభుత్వాలు పదేళ్ల తర్వాత అమలు చేయటం ప్రారంభిస్తుండటం వల్ల ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. దేశంలోనే మొదటిసారిగా సిటిజన్ ఛార్టర్లను లోక్‌సత్తా 1998లో రూపొందించి అమలుకు కృషి ప్రారంభిస్తే, ఇప్పటికీ అమలు అంతంత మాత్రంగానే ఉందన్నారు. ప్రభుత్వ సేవలు ఆలస్యమైతే ప్రజలకు విధిగా రోజువారీ పరిహారం చెల్లించే సర్వీస్ గ్యారంటీ చట్టం ఇంకా పార్లమెంటు ముందు పెండింగ్‌లోనే ఉందన్నారు.

### అవినీతి కుంభకోణాల్ని వరసగా బైటపెడుతున్న లోక్‌సత్తా పార్టీ జీహెచ్‌ఎంసీ బృందానికి ప్రశంసలు

స్వచ్ఛహైదరాబాద్, స్వచ్ఛభారత్‌లో నిధుల దుర్వినియోగం, ప్రజాధనంతో గత ఐదేళ్లలో కార్పొరేటర్ల విలాసాలు, ఎన్నికల ఖర్చుపై దొంగలెక్కలు సమర్పించటం, బడ్జెట్‌లో 77శాతం నిధుల్ని కేంద్ర కార్యాలయం నుంచి ఖర్చు చేసి కేవలం 23శాతాన్ని మాత్రమే వార్డుస్థాయికి కేటాయించటం, రూ.100కోట్ల వాహనాల కుంభకోణం, గర్భనిరోదక వ్యాక్సిన్‌కి ఒక్కో కుక్కకు రూ.5,000 ఖర్చు చేసినట్టు చూపుతున్నా ఫలితాలు లేకపోవటం... ఇలా జీహెచ్‌ఎంసీలోని అవినీతి కుంభకోణాల పరంపరను, కేంద్రీకృత పాలనను సహ చట్టం అస్త్రంతో బైటపెడుతున్న లోక్‌సత్తా పార్టీ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దోసపాటి రాము, బొంతు సాంబిరెడ్డి బృందాన్ని జేపీ ఈ సందర్భంగా ప్రశంసించారు. ఇలాంటి అవినీతి జరగకుండా లోక్‌సత్తా చూపుతున్న వార్డుస్థాయికి తలసరి రూ.2000 నిధుల కేటాయింపు వంటి వ్యవస్థీకృత పరిష్కారాల్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. స్థానిక ఎన్నికలు సకాలంలో, అవకతవకలు లేకుండా జరగటానికి బీసీ గణన తదితర అంశాలన్నిటినీ రాష్ట్ర ఎన్నికల సంఘం పరిధిలోకి తెచ్చి పూర్తి అధికారాలివ్వాలని జయప్రకాష్ నారాయణ్ అన్నారు.

లోక్‌సత్తా పార్టీ నేతలు గంగాభవానీ, మెట్ల జగన్, కిషోర్, శివరామకృష్ణ వంశీప్రసాద్, సుబ్రమణ్యం, నరసింహ తదితరులు పాల్గొన్నారు. ❒

# లోక్‌సత్తాని రాజకీయ శక్తిగా మలచాలి
# జీహెచ్ఎంసీలో సురేంద్ర శ్రీవాస్తవ విస్తృత పర్యటన



లోక్‌సత్తా పార్టీని మరింత పటిష్ట పరిచేందుకు నాయకులు, కార్యకర్తలు సమాయత్తం కావాలని పార్టీ జాతీయ అధ్యక్షుడు సురేంద్ర శ్రీవాస్తవ పిలుపునిచ్చారు. గ్రేటర్ హైదరాబాద్ కార్పొరేషన్ ఎన్నికల నేపథ్యంలో ఆయన హైదరాబాద్ నగరంలో విస్తృతంగా పర్యటించారు. అంబర్‌పేట నియోజకవర్గంలో నాయకులు, ముఖ్య కార్యకర్తల సమావేశంలో ముఖ్యఅతిథిగా సురేన్ మాట్లాడుతూ, చాలామంది చదువుకున్న ఓటర్లు ఎన్నికలకు దూరంగా ఉండటం వల్ల అసమర్థులు, అవినీతిపరులు చట్టసభలకు ఎన్నికవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని విద్యావంతులైన ప్రతి ఒక్కరూ ఓటింగ్‌లో పాల్గొని సమర్థులైన అభ్యర్థులకు ఓటువేస్తే అలాంటివారు నిస్వార్థంగా సరైనరీతిలో ప్రజలకు సేవలందిస్తారని అన్నారు. చంద్రబాబుపై ఉన్న ఓటుకు కోట్లు కేసును నీరుగార్చేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. ఎన్నికల సమయంలో విచ్చలవిడిగా జరుగుతున్న డబ్బు, మద్యం, ఇతర ప్రలోభాలను అరికట్టేందుకు ఎన్నికల సంఘం ఇంకా పటిష్ట చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

లోక్‌సత్తా పార్టీ తెలంగాణ అధ్యక్షుడు డా॥ పాండు రంగారావు మాట్లాడుతూ, గ్రేటర్ హైదరాబాద్‌లో తెరాస ప్రభుత్వం చేసిన అభివృద్ధి శూన్యమన్నారు. నగరంలో ఎక్కడ చూసినా గుంతల రోడ్లే దర్శనమిస్తున్నాయన్నారు. కార్పొరేషన్ ఎన్నికలస్తున్నందున హడావుడిగా రోడ్ల మరమ్మతులు ప్రారంభించారని, కనీసం డ్రైనేజీని కూడా బాగు చేయకుండా వేస్తున్న ఈరోడ్ల వల్ల వందల కోట్ల ప్రజాధనం మళ్లీ వృథా అవుతుందని అన్నారు. అంబర్‌పేట నియోజకవర్గం ఇంఛార్జి మునిపల్లె వెంకటేష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పార్టీ లీగల్ సెల్ జాతీయ కన్వీనర్ నాగేంద్రబాబు, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు గజానని, జగన్ మెట్ల, సంతోష్, కోటేశు, సందీప్, విష్ణు, శ్రీనివాసరెడ్డి, బాలు, శ్రీనివాస్ నాయుడు, రాజా నాయుడు తదితర నేతలు పాల్గొన్నారు.

**మౌలాలిలో**

ప్రజల జీవనప్రమాణాలు మెరుగుపడటంతోపాటు వారి సమగ్రాభివృద్ధి లోక్‌సత్తాతోనే సాధ్యమవుతుందని సురేంద్ర శ్రీవాస్తవ అన్నారు. జీవన ప్రమాణాలు మెరుగుపడినప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. పేదరికం, నిరక్షరాస్యత, వివక్ష, అసమానతలు తొలగనిదే ఎదిగే అవకాశాలు రావని, వాటిని తొలగించే విధానాలు లోక్‌సత్తాకు మాత్రమే ఉన్నాయని అన్నారు. మౌలాలి డివిజన్ పరిధిలో ఎంజే కాలనీ, గాయత్రీ నగర్, గాంధీనగర్ తదితర కాలనీల్లో ఆయన విస్తృతంగా పర్యటించారు. స్థానికులతో ఇష్టాగోష్టి నిర్వహించారు. మౌలాలి పార్టీ కార్యాలయంలో గ్రేటర్ కార్పొరేషన్ ఎన్నికలలో పార్టీ విజయావకాశాలపై చర్చించారు. కార్యక్రమంలో పార్టీ నేతలు గజానని, శ్రీనివాసవర్మ, గంగాధర్, నాగమణి, రవికళ్యాణ్, అంజి, సునీల్, శివ, అజయ్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

**కూకట్‌పల్లిలో**

గ్రేటర్ హైదరాబాద్‌లో సరైన పాలన లోక్‌సత్తాతోనే సాధ్యమని, బలమైన రాజకీయ శక్తిగా ఎదిగేందుకు పోరాటస్ఫూర్తితో పనిచేయాలని సురేంద్ర శ్రీవాస్తవ అన్నారు. ఉద్యోగావకాశాల కోసమే తెలంగాణ ఉద్యమం వచ్చిందని, ఇంటికో ఉద్యోగం ఇస్తామని చెప్పిన తెరాస ప్రభుత్వం చివరికి కేసీఆర్ కుటుంబసభ్యులకు మాత్రమే రాజకీయ ఉపాధిని కల్పించిందని అన్నారు. హైదరాబాద్ నగరంలో మంచినీటి ఎద్దడిని నివారించటంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. హైదర్‌నగర్ డివిజన్ అధ్యక్షుడు జయప్రకాష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పార్టీ నేతలు లావణ్య, శివకుమార్, భానుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ❐

# ప్రాణహిత-చేవెళ్లలాంటి ప్రాజెక్టులతో బంగారు తెలంగాణ ఎలా వస్తుంది: సురేంద్ర శ్రీవాస్తవ



పెద్దకోడూరులో భూములు కోల్పోనున్న రైతుల దీక్షా శిబిరాన్ని సందర్శించి మాట్లాడుతున్న లోక్‌సత్తా జాతీయ అధ్యక్షుడు సురేంద్రజీ శ్రీవాస్తవ

పాలకుల స్వార్థం కోసమే ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టుని డిజైన్ల మార్పు వంటి కథలతో కొనసాగిస్తున్నారని, ఇది నాయకులకు కమీషన్లను ఇస్తుంది తప్ప రైతులకు, తెలంగాణ రాష్ట్రానికి మాత్రం గుదిబండగా మారుతుందని లోక్‌సత్తా పార్టీ జాతీయ అధ్యక్షుడు సురేంద్ర శ్రీవాస్తవ అన్నారు. ఇలాంటి ప్రాజెక్టులు, విధానాలతో రాష్ట్రం బంగారు తెలంగాణగా ఎలా మారుతుందోగానీ, కేసీఆర్‌కు ముఖ్యమంత్రి కావాలన్న కల మాత్రం నెరవేరిందన్నారు. కొత్త రాష్ట్రం కోసం కొట్లాడిన రైతులు ఆ కల నెరవేరిన ఏడాదిన్నరలోనే రోడ్లెక్కాల్సి రావటం విచారకరమన్నారు. మెదక్ జిల్లా పెద్దకోడూరులో ప్రాణహిత-చేవెళ్ల జలాశయం వల్ల భూములు కోల్పోతున్న రైతులు చేపట్టిన దీక్షా శిబిరాన్ని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డా॥ పాండురంగారావుతో కలిసి సురేంద్ర శ్రీవాస్తవ రైతుల శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. తమకు ప్రభుత్వం ఇస్తున్న పరిహారం చాలదని, దాన్ని పెంచాలనే డిమాండ్‌తో రైతులు దీక్ష చేస్తున్నారు. ఈ సందర్భంగా సురేన్ మాట్లాడుతూ, ప్రాణహిత-చేవెళ్ల ఏరకంగా ఖర్చుకు, ఫలితాలకు సంబంధం లేని అసంబద్ధ పథకమవుతుందో ఆ పథకాన్ని ప్రతిపాదించిన రోజు నుంచీ చెబుతోందని గుర్తుచేశారు. గత పాలకుల వలే నేటి పాలకులు కూడా స్వార్థం కోసమే ఈ ప్రాజెక్టును కొనసాగిస్తున్నారన్నారు. ప్రాజెక్టు కోసం అనివార్యంగా భూమిని సేకరించాల్సి వస్తే రైతుల్ని ఒప్పించి తీసుకోవాల్సిందే తప్ప బెదిరించటం సరికాదన్నారు. రైతు కోల్పోయే భూమికి న్యాయమైన పరిహారం ఇవ్వాలని, సాగుయోగ్యమైన భూముల్ని మరో చోట చూపాలని, రైతు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని అన్నారు. ఇంటికో ఉద్యోగం ఇస్తామన్న కేసీఆర్ ఇంట్లో నలుగురికి ఉన్నత పదవులు దక్కాయన్నారు. భూములు కోల్పోయే రైతులకు న్యాయం జరిగే వరకూ లోక్‌సత్తా అండగా ఉంటుందన్నారు. సంఘీభావ కార్యక్రమంలో లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తుమ్మనపల్లి శ్రీనివాస్, తెలంగాణ ఉద్యమ సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఆకుల శ్రీనివాస్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జంగిటి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.



## న్యాయమైన పరిహారం ఇవ్వాలి

ప్రాణహిత-చేవెళ్ల జలాశయంలో భూములు కోల్పోతున్న రైతులకు సరైన న్యాయం చేయాలని కోరుతూ తుమ్మనపల్లి శ్రీనివాస్, జంగిటి శ్రీనివాస్‌ల ఆధ్వర్యంలో రైతులు తహసీల్దార్ స్వామికి వినతిపత్రం ఇచ్చారు. కరీంనగర్ జిల్లా ధర్మారం మండలంలో రైతులకు ఇచ్చిన నష్టపరిహారం కంటే కూడా మూడు లక్షల తక్కువ పరిహారాన్ని ఇక్కడి రైతులకు ఇస్తామని ప్రభుత్వం చెబుతోందని, ప్రతిపక్ష పార్టీలను విమర్శిస్తున్న మంత్రి హరీష్‌రావుకి చిత్తశుద్ధి ఉంటే ప్రభుత్వ చీఫ్ విప్ కొప్పుల ఈశ్వర్ బాటలో ఇక్కడి రైతులకు కూడా న్యాయమైన పరిహారం ఇప్పించాలని, భూములు కోల్పోయిన రైతుల ఇంటిలో ఉద్యోగం ఇప్పించాలని డిమాండ్ చేశారు. పలువురు నేతలు, రైతులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ❐

# ప్రత్యేక హోదాపై దగా

ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వకుండా ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రి వెంకయ్య నాయుడు, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విశ్వాసఘాతుకానికి పాల్పడ్డారని అఖిలపక్ష నేతలు ధ్వజమెత్తారు. అమరావతి శంకుస్థాపనకు వచ్చిన మోదీ.. ప్రత్యేక హోదా ఇవ్వకుండా తెలుగు ప్రజల్ని అవమానించారన్నారు. అదే మట్టి, నీటితో ఢిల్లీలో ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ప్రత్యేక హోదా ఆంధ్రుల హక్కు నినాదాల మధ్య ప్రత్యేక హోదా సాధన సమితి ఆధ్వర్యంలో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిర్వహించిన ధర్నాలో సీపీఎం, సీపీఐ, లోక్‌సత్తా, ఆమ్ ఆద్మీ, వైకాపా, కాంగ్రెస్ పార్టీలు పాల్గని మద్దతు ప్రకటించాయి. ప్రత్యేక హోదా చీకటి ఒప్పందం కాదని, కేంద్ర మంత్రి వెంకయ్యనాయుడు సాక్షిగా పార్లమెంటులో నాటి యూపీయే ప్రభుత్వం చేసిన విస్పష్ట ప్రకటన అని సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి అన్నారు. ప్రత్యేక హోదాతోనే రాష్ట్రం ఆర్థికంగా, పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతుందని సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర రెడ్డి అన్నారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిని దృష్టిలో ఉంచుకునే నాటి ప్రభుత్వం ప్రత్యేక హోదాను ప్రకటించిందని కాంగ్రెస్ ఎంపీ జైరాం రమేష్ అన్నారు. పార్టీ తరపున ప్రత్యేక హోదా కోసం పోరాటం చేస్తున్నామని, పార్లమెంటు లోపల, బైట తమ కృషి కొనసాగుతుందని వైకాపా ఎంపీ మేకపాటి తెలిపారు. లోక్‌సత్తా పార్టీ ఆంధ్రప్రదేశ్ అధికార ప్రతినిధి ూసంపూడి శ్రీనివాస్ మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్‌కి విభజన సమయంలో ఇచ్చిన హామీలన్నిటినీ అమలు చేయాలని, ముఖ్యంగా రాయితీలతో కూడిన ప్రత్యేక హోదా, వెనకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీలను తక్షణమే ఈ పార్లమెంటు సమావేశాల్లోనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం రాష్ట్రం నుంచి తీసుకొచ్చిన మట్టిపాత్రలతో ప్రధాని నివాసం ముట్టడికి బయల్దేరిన నేతలను పోలీసులు అడ్డుకున్నారు. కార్యక్రమంలో సీపీఐ ఎంపీ డి.రాజా, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.శ్రీనివాసరావు, వై.వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ ఎంపీలు సుబ్బరామిరెడ్డి, కేవీపీ రామచంద్రరావు, ఆంధ్ర మేధావుల సంఘం అధ్యక్షుడు చలసాని శ్రీనివాస్, మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు కారెం శివాజీ, ఆప్ నేత పోతిన రామారావు, సోషల్ డెమోక్రటిక్ పార్టీ నాయకుడు హబీబుల్లా, ఫార్వర్డ్ బ్లాక్ నేత దేవరాజ్, సయ్యద్ వలీల్ ఖాద్రి (ఏఐఎస్ఎఫ్), శంకర్ (గిరిజన విద్యార్థి సమాఖ్య), ప్రజాసంఘాల నేతలు ప్రొఫెసర్ అప్పల నాయుడు, రామారావు, పీజే చంద్రశేఖర్, జీవీ సత్యనారాయణ రాజు, చలసాని రామారావు, దుర్గాభవానీ, దోనేపూడి శంకర్, కేవీవీ ప్రసాద్, అరుణ, జనార్ధనరెడ్డి, మల్లికార్జునరావు, సదాశివరెడ్డి తదితరులు ప్రసంగించారు.




ప్రత్యేక హోదాను తొలుత ప్రతిపాదించింది జేపీయే, ఐకమత్యంతో సాధిద్దాం

రాష్ట్ర విభజన సమయంలో పరిశేష ఆంధ్రప్రదేశ్‌కు పారిశ్రామిక పన్ను రాయితీలున్న ప్రత్యేక హోదా కావాలని, వెనకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్ర, ఉత్తర తెలంగాణకు ప్రత్యేక ఆర్థికసాయం కావాలని అసెంబ్లీ సాక్షిగా తొలుత ప్రతిపాదించింది లోక్‌సత్తా పార్టీ వ్యవస్థాపకులు డా॥ జయప్రకాష్ నారాయణేనని పార్టీ ఏపీ ప్రధాన కార్యదర్శి భీశెట్టి బాబ్జీ గుర్తుచేశారు. పార్టీల విద్వేష రాజకీయాలు, తెలుగు వారి మధ్య అనైక్యత కారణంగా నాటి యూపీయే ప్రభుత్వం అసెంబ్లీ అంగీకారం లేకుండానే రాష్ట్రాన్ని విభజించిందన్నారు. ఎన్నికల తర్వాత కూడా ఆంధ్రప్రదేశ్‌కి న్యాయం చేయాలని నిర్దిష్ట డిమాండ్లతో 'తెలుగు భవిత' కార్యక్రమం ద్వారా జేపీ రాయలసీమ, ఉత్తరాంధ్ర, హైదరాబాద్‌లో దీక్షలు చేసి, అఖిలపక్ష రౌండ్‌టేబుల్ సమావేశాల్ని నిర్వహించారని, అయితే ఓట్లు, సీట్లు పొందిన పార్టీలే తెలుగు ప్రజల ప్రయోజనాలకు గండి కొడుతున్నందున తమ ప్రయత్నం నత్తనడకన సాగుతోందని అన్నారు. ఇప్పటికైనా అన్ని పార్టీలూ, ప్రజాసంఘాలు పార్లమెంటులో, ఎన్నికల సమయంలో ఏపీకి ఇచ్చిన అన్ని హామీల్ని సాధించుకునేందుకు ఐకమత్యంతో పోరాడాలని బాబ్జీ విజ్ఞప్తి చేశారు. ❐

# ఇంకుడు గుంతల కోసం వసూలు చేసిన డబ్బు ఏమైంది?

ఇంకుడు గుంతల పేరుతో గ్రేటర్ హైదరాబాద్ కార్పొరేషన్ ప్రజల నుంచి వసూలు చేసిన రూ.138 కోట్లను సద్వినియోగం చేయాలని లోక్‌సత్తా పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. లోక్‌సత్తా పార్టీ జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యదర్శి బొంతు సాంబిరెడ్డి, జయప్రకాష్, రాజు, లింగరాజు, రామ్మోహనరావు తదితర నేతలు కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి, జూబ్లీహిల్స్ నియోజకవర్గాలలో 2013లో నిర్మించిన ఇంకుడు గుంతలపై సర్వే చేసి వివరాలను వెల్లడించారు. సాంబిరెడ్డి మాట్లాడుతూ, కూకట్‌పల్లి అంజయ్యనగర్, కేపీహెచ్‌బీ కాలనీ, కూకట్‌పల్లి డివిజన్లు, బాలాజీనగర్, జూబ్లీ హిల్స్, శేరిలింగంపల్లిలోని పలుప్రాంతాల్లో ఇంకుడు గుంతలు నిర్మించగా అస్తవ్యస్తంగా మారి నిరుపయోగంగా మారాయన్నారు. వోల్టా చట్టం ప్రకారం ఇంకుడు గుంతల కోసం జీహెచ్‌ఎంసీ ద్వారా రూ. 105కోట్లు, వాటర్‌బోర్డు ద్వారా రూ. 33కోట్లు ప్రజల ముక్కుపిండి వసూలు చేసి అందులో రూ. 6.82కోట్లు మాత్రమే ఖర్చుచేశారన్నారు. వాటి ఖర్చు కూడా ఉపయోగంలేకుండా పోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రిజర్వాయర్లు రాత్రికి రాత్రి ఖాళీ అయిపోవని, అయినా తాగునీటి ఎద్దడి గురించి కనీస జాగ్రత్త కార్పొరేషన్‌కి, ప్రభుత్వానికి లేకుండా పోయిందని అన్నారు. ముందుచూపుతో ఇంకుడు గుంతల నిర్మాణాన్ని అప్పుడు కూకట్‌పల్లి శాసనసభ్యునిగా జయప్రకాష్ నారాయణ్ ఎన్నోమార్లు ప్రతిపాదించి ప్రచారం చేశారని, అయినా ప్రభుత్వం మొక్కుబడిగానే స్పందించి చేతులు దులుపుకుందని అన్నారు. వివిధ కాలనీల ప్రజలకు అధికారాల్ని, వసూలు చేసిన నిధులను ఇచ్చి వారి చేతే ఇంకుడు గుంతల కార్యక్రమాన్ని నిర్వహింపచేస్తే విజయవంతమవుతుందని, నగరానికి నీటి సమస్య కూడా అదుపులోకి వస్తుందని అన్నారు.

**వోల్టా చట్టం ప్రకారం ఇంకుడు గుంతల కోసం జీహెచ్‌ఎంసీ ద్వారా రూ.105కోట్లు, వాటర్‌బోర్డు ద్వారా రూ.33కోట్లు ప్రజల ముక్కుపిండి వసూలు చేసి అందులో రూ.6.82కోట్లు మాత్రమే ఖర్చుచేశారన్నారు. వాటి ఖర్చు కూడా ఉపయోగంలేకుండా పోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రిజర్వాయర్లు రాత్రికి రాత్రి ఖాళీ అయిపోవని, అయినా తాగునీటి ఎద్దడి గురించి కనీస జాగ్రత్త కార్పొరేషన్‌కి, ప్రభుత్వానికి లేకుండా పోయిందని అన్నారు. ముందుచూపుతో ఇంకుడు గుంతల నిర్మాణాన్ని అప్పుడు కూకట్‌పల్లి శాసనసభ్యునిగా జయప్రకాష్ నారాయణ్ ఎన్నోమార్లు ప్రతిపాదించి ప్రచారం చేశారని, అయినా ప్రభుత్వం మొక్కుబడిగానే స్పందించి చేతులు దులుపుకుందని అన్నారు.**

### చెత్త ఏరివేతలో రూ.100 కోట్ల అవినీతి

జీహెచ్‌ఎంసీ పరిధిలో చెత్త ఏరివేత కోసం ఏర్పాటు చేసిన వాహనాల రిపేరు, ఇంధనానికి కేటాయించిన రూ. 525 కోట్లలో రూ. 100 కోట్ల అవినీతి జరిగిందని సాంబిరెడ్డి, జీహెచ్‌ఎంసీ లోక్‌సత్తా పార్టీ కార్యదర్శి మెట్ల జగన్ ఆరోపించారు. సంబధిత ఆధారాలను వారు మీడియాకు విడుదల చేశారు. గ్రేటర్ హైదరాబాద్ కార్పొరేషన్‌లోని 874 వాహనాలలో 370 సుమారు పదిహేనేళ్ల పూర్వమే కొన్నవని, ఇందులో 99వాహనాలు పనికిరానివని రోడ్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ నిర్ధారించిందని తెలిపారు. ఆటోలను టిప్పర్‌లాగా, 25 టన్నుల వాహనాలుగా చూపిస్తున్నారన్నారు. జీహెచ్‌ఎంసీ ఇచ్చిన వాహనాలు ప్రైవేటు వ్యక్తులు ఫైనాన్స్ తీసుకున్నట్టు ఉన్నాయని, ఐదేళ్లలో ప్రతి వాహనం రిపేరు కోసం చేసిన వ్యయం కొత్త వాహనం కొన్నదానికంటే ఎక్కువగా ఉందని అన్నారు. ఇందులో మూడు వాహనాలకు నంబర్‌ప్లేట్లు కూడా లేవన్నారు. మోటారు సైకిలు ఖర్చు రూ. 1.5లక్షలు కాగా, బజాజ్ చేతక్ ఖర్చు రూ. 1.24 లక్షలుగా ఏటా చూపుతున్నారన్నారు. 2009 నుంచి 2015 వరకు రూ. 730 కోట్లు వాహనాల విడిభాగాలకు ఖర్చు పెట్టారన్నారు. దీనిలో ఇంధనం కోసం రూ. 363.14 కోట్లు, రిపేర్ల కోసం రూ. 167కోట్లు ఖర్చయినట్టుగా చూపిస్తున్నారని, సుమారు రూ. 100 కోట్ల అవినీతి జరిగిందని వివరించారు. విజిలెన్స్, ఏసీబీ అవినీతిని నిర్ధారించినా ఇంతవరకూ చర్యలు లేవన్నారు. ఈ విషయంపై నగరవ్యాప్తంగా ప్రజలకు తెలియచేసి చైతన్యవంతం చేస్తామన్నారు. ❐

# స్వచ్ఛ హైదరాబాద్ ప్రచారంలోని కాలుష్యాన్ని బైటపెట్టిన లోక్‌సత్తా

స్వచ్ఛ భారత్‌లో భాగంగా తెలంగాణ ప్రభుత్వం ప్రారంభించిన స్వచ్ఛ హైదరాబాద్ వైఫల్యానికి ప్రచారం పేరుతో చేసిన పందేరాలే తొలి తార్కాణమని, మూడు రోజుల స్వచ్ఛ హైదరాబాద్ అనవసర ప్రచార ఖర్చుతో నగరానికి నిజమైన సఫాయి సైనికులుగా ఉన్న వెయ్యిమంది పారిశుద్ధ్య కార్మికులకు రెండు నెలలపాటు జీతాలివ్వొచ్చని లోక్‌సత్తా పార్టీ పేర్కొంది. ప్రభుత్వం ఉచితంగా, నామమాత్రపు ఖర్చుతో అవగాహన, సమీక్ష సమావేశాలు నిర్వహించుకోవటానికి రవీంద్ర భారతి, పలు కమ్యూనిటీ హాళ్లు అందుబాటులో ఉండగా సైబరాబాద్ కన్వెన్షన్ సెంటర్‌లో స్వచ్ఛ హైదరాబాద్ పేరుతో రూ.1 కోటీ 8లక్షలు దుబారా చేశారని లోక్‌సత్తా పార్టీ జాతీయ అధ్యక్షుడి ప్రత్యేక ప్రతినిధి, గ్రేటర్ హైదరాబాద్ విభాగం ప్రధాన కార్యదర్శి బొంతు సాంబిరెడ్డి తెలిపారు. ఇది కాకుండా హోర్డింగుల కోసం రూ.35లక్షలు, ఒకరోజు టీ-షర్టుల కోసం రూ.15లక్షలు, ఇతర ప్రచారాలకు మరొక రూ.50లక్షలు ఖర్చు చేశారన్నారు.

స్వచ్ఛ హైదరాబాద్ ప్రచారం పేరుతో ప్రభుత్వం చేసిన ప్రజాధనం దుర్వినియోగం వివరాలను సాంబిరెడ్డి అమీర్‌పేటలోని లోక్‌సత్తా పార్టీ కార్యాలయంలో మీడియాకు విడుదల చేశారు.

సైబరాబాద్ కన్వెన్షన్ సెంటర్‌లో 2015 మే 6, 16, 22 తేదీల్లో జరిగిన స్వచ్ఛ హైదరాబాద్ సమావేశాలలో అద్దెకోసం రూ.23,39,415, ఆహారపానీయాల కోసం రూ.11,36,106, ప్రొజెక్టర్ కోసం రూ.10,51, 587, వేదిక అలంకరణకు రూ.12,37,821, లైట్ అండ్ సౌండ్ కోసం రూ.7,44,991, ఈవెంట్ మేనేజ్‌మెంట్‌కు రూ. 3,32,585, సమావేశం వద్ద ఫెక్సీల డిజైనింగ్‌కు రూ.10,70,685, ప్రింటింగ్ కోసం రూ.28,93,883 ఖర్చు చేశారని సాంబిరెడ్డి వివరించారు. ఒకేచోట వరస సమావేశాలు పెట్టినప్పుడు ప్రతి సమావేశానికీ ఖర్చు తగ్గాల్సి ఉండగా, ఇక్కడ ప్రతి సమావేశానికీ లక్షల మేర ఖర్చు పెరిగిందన్నారు. మొదటి సమావేశానికి రూ.33,91,795 ఖర్చుకాగా, మూడో సమావేశం వచ్చే సరికి రూ. 37,91,831 ఖర్చయిందన్నారు. ఇక నగరం మొత్తం మీద 193 హోర్డింగులకు రూ.35లక్షలు పందేరం చేశారని, ఇందులో జరిగిన రూ.16లక్షల అవినీతిని ఇప్పటికే బైటపెట్టామని గుర్తుచేశారు. రూ. 15లక్షలతో కొనుగోలు చేసిన టీ-షర్టులు వగైరాలు ఏమయ్యాయో ఎవరికీ తెలియదన్నారు. ఈ అనవసర వ్యయంతో రెండు నెలలపాటు వెయ్యిమంది సఫాయీ కార్మికులకు జీతాలివ్వొచ్చు లేదా ప్రభుత్వం లెక్కల ప్రకారమే మూడు డివిజన్లను బాగు చేయవచ్చని అన్నారు.

హైదరాబాద్‌ను బాగు చేసుకోవటం కోసం తాను, గవర్నర్, కొంతమంది ఉన్నతాధికారులు నడుం బిగించామని ముఖ్యమంత్రి చేసుకుంటున్న ప్రచారం హాస్యాస్పదంగా ఉందని, సీఎం, గవర్నర్ దత్తత తీసుకున్న పార్సిగుట్ట, ఆనంద్‌నగర్ కాలనీ ప్రాంతాల్లో పారిశుద్ధ్య సమస్యలు, రోడ్లపై గుంతలు, డ్రైనేజీ పొరటం, ఫుట్‌పాత్‌ల ఆక్రమణ, దోమలు ఇంకా అంతే అధ్వాన్నంగా ఉన్నాయన్నారు. స్వచ్ఛ హైదరాబాద్ పేరుతో కాలనీల, బస్తీల బాధ్యత తీసుకున్నామని ఆర్భాటం చేసిన సీఎం, గవర్నర్, సుమారు 36,000 మంది అధికారులు.. జీహెచ్ఎంసీలో నెలరోజుల పాటు పారిశుద్ధ్య కార్మికులు సమ్మె చేసిన సమయంలో ఏమైపోయారని, వచ్చి ఏ వార్డుల్ని, కాలనీలను బాగుచేశారని ప్రశ్నించారు. నిజంగా స్వచ్ఛ హైదరాబాద్‌ని సాధించాలని కేసీఆర్ ప్రభుత్వానికి సంకల్పం ఉంటే ఈ ప్రచార ఆర్భాటాన్ని, కార్పొరేటర్, మేయర్ అధికారాలను కబ్జా చేసే ధోరణుల్ని వదిలి, లోక్‌సత్తా తొలినుంచీ చెబుతున్నటుల స్థానిక స్థాయిలోకి నిధుల్ని, అధికారాల్ని బదిలీ చేసి వార్డు స్థాయిలో తలసరి రూ.2000ను నేరుగా బడ్జెట్ నుంచి కేటాయించాలని బొంతు సాంబిరెడ్డి డిమాండ్ చేశారు.

లోక్‌సత్తా పార్టీ గ్రేటర్ హైదరాబాద్ ఉపాధ్యక్షురాలు గంగాభవానీ, స్ట్రాటజీ ఇంఛార్జి రామచందర్, కమ్యూనికేషన్స్ కార్యదర్శి లావణ్య, శ్రావణ్ తదితరులు సమావేశంలో పాల్గొన్నారు. ❐

# పూలే భావాలకు రాజకీయ వేదిక లోక్‌సత్తా

మహాత్మా జోతిరావ్ పూలే జయంతులు, వర్థంతులు జరపటానికి పరిమితంకాకుండా ఆయన ఆశయాల్ని రాజకీయ విధానాల్లో భాగం చేయటానికి అణగారిన వర్గాలు పోరాడాలి. శూద్రులు, అతి శూద్రుల అభ్యున్నతి కోసమే కాకుండా ఆ వర్గాలలో కూడా వివక్షకు గురవుతున్న మహిళల అభివృద్ధి కోసం పూలే కృషి చేశారు. నాయీ బ్రాహ్మణ కులాన్ని నీచంగా చూడటాన్ని పూలే తీవ్రంగా ప్రశ్నించారు. శూద్రులు చదవకూడదని శాసించిన మనుధర్మ శాస్త్రాన్ని మట్టుబెట్టి దళిత, బలహీన వర్గాల పల్లెల్లో, కాలనీల్లో రాత్రి పూట భార్య సావిత్రీ బాయి పూలేని ఉపాధ్యాయురాలిగా తీర్చిదిద్ది చదువును అందించే ప్రయత్నం చేశారు జోతిరావ్. ఫలితంగా వేలాది నిరక్షరాస్యులైన బడుగులకు అక్షరజ్ఞానం అందింది. పూలే చేసిన గొప్ప పనుల్లో గ్రామసభల ద్వారా ప్రజల సాధికారతకు కృషి చేయటం ఒకటి. ప్రజలకు స్వతంత్ర జీవనం



రావటానికి అధికార వికేంద్రీకరణ అవసరమని పూలే భావించారు. మహాత్మా పూలే భావాలకు లోక్‌సత్తా పార్టీ రాజకీయ వేదికగా ఉండటాన్ని గర్వకారణంగా భావిస్తున్నాం.

**– కొర్లకంటి బాలస్వామి,** లోక్‌సత్తా పార్టీ ఖమ్మం జిల్లా ఉపాధ్యక్షులు

# పెరుగుతున్న విద్యుత్తు భారం

వివిధ వర్గాలకు ఇస్తున్న రాయితీల భారం ముందస్తు అంచనాల కన్నా అధికంగా ఉన్నట్టు తెలంగాణ ప్రభుత్వం గుర్తించింది. 2014-15లో ఇచ్చిన రాయితీ నిధులు సరిపోలేదని, అదనంగా రూ.1100 కోట్లు ఇవ్వాలని ట్రాన్స్‌కో కోరింది. ఇందులో అంచనాకు అదనంగా రాయితీ రూ.600 కోట్లు కాగా, మిగిలిన 500 కోట్లు నిర్ణీత విద్యుత్తు ఛార్జీల ప్రకారం రావాల్సిన బకాయిలు. ఈ ఏడాది ప్రభుత్వం నెలనెలా రూ.354.77 కోట్లను విద్యుత్తు రాయితీల కింద విడుదల చేస్తోంది. అయితే గతేడాది బకాయిల కింద రూ.1100 కోట్లు అదనంగా ఇస్తేనే గట్టెక్కుతామని స్పష్టంచేసింది. మరోవైపు, కోతలు లేకుండా సరఫరా చేయటానికి విద్యుత్తు కొనుగోలు కూడా భారంగా మారింది. డిమాండ్‌కు తగ్గట్టు సరఫరాకి బహిరంగ విపణిలో భారీగా విద్యుత్తును కొనుగోలు చేయాల్సి వస్తోంది. వర్షాలు తక్కువగా కురవటం వల్ల జలవిద్యుదుత్పత్తికి అవకాశం లేకపోవటంతో కొనుగోలు భారం పెరుగుతోంది. గత జూన్ నుంచి ఖరీఫ్ వర్షాలు లేకపోవటంతో కృష్ణా నదికి వరద రాలేదు. దీనివల్ల జలవిద్యుదుత్పత్తి అసలు ప్రారంభమే కాలేదు. జూన్ నుంచి ఆగస్టు వరకు పంటలకు, ఇళ్లకు విద్యుత్తు సరఫరా కోసం బహిరంగ విపణిలో అధిక ధరకు థర్మల్ విద్యుత్తు కొనాల్సివచ్చింది. ఆగస్టు నాటికి కొనుగోలు చేసిన విద్యుత్తు కోసమే రూ.1,172 కోట్ల బకాయిల్ని ట్రాన్స్‌కో, డిస్కంలు ఉత్పత్తిదారులకు చెల్లించాల్సి ఉంది. ఇవి కాక ప్రభుత్వ శాఖల బకాయిలు భారీగా పెరిగిపోయాయి. ఈ పరిస్థితుల్లో ఆర్థికభారం తట్టుకోవటానికి రూ.4,272 కోట్లు తక్షణ గ్రాంట్‌గా ఇవ్వాలని తెలంగాణ ట్రాన్స్‌కో రాష్ట్ర ఇంధనశాఖకు లేఖ రాసింది. విద్యుదుత్పత్తి సంస్థ (జెన్‌కో), డిస్కంల ఆర్థిక పరిస్థితి క్లిష్టంగా ఉందని తెలిపింది. అంతరాయం లేకుండా సరఫరాకి నెలనెలా కోట్లాది రూపాయల్ని వెచ్చించాల్సి వస్తోంది. ప్రస్తుతం ఆర్థిక పరిస్థితి బాగోలేనందున సొంత వనరుల నుంచి బకాయిలు చెల్లించే స్తోమతు విద్యుత్తు సంస్థలకు కనిపించటం లేదు. విద్యుత్తు ఒప్పందాలను, సుమారు రూ.90,000 కోట్లతో ప్రతిపాదించిన నూతన ఉత్పత్తి కేంద్రాల ఆచరణసాధ్యతను, పంపిణీ తీరును సమగ్రంగా సమీక్షించి సంస్కరణలను అమలు చేస్తేనే ముందు కూడా తెలంగాణలోకవిద్యుత్తు సంక్షోభం తలెత్తకుండా ఉంటుందని నిపుణులు సూచిస్తున్నారు. కాగా, కేంద్రప్రభుత్వం ప్రకటించిన ఉజ్వల్ భరోసా పథకం (ఉదయ్)లో చేరితే దీర్ఘకాలంలో కూడా కష్టాల్ని గట్టెక్కే అవకాశముందని డిస్కంలు తెలంగాణ ప్రభుత్వానికి ప్రతిపాదిస్తున్నాయి. ❒

# వీధికుక్కల్ని అరికట్టటంలో జీహెచ్ఎంసీ విఫలం



ఒక్కో కుక్కకు గర్భ నిరోధక వ్యాక్సిన్ వేసేందుకు రూ. 5,000 ఖర్చు చేసినా, హైదరాబాద్ నగరంలో ఇబ్బడిముబ్బడి వీధికుక్కలు ఎలా పెరిగాయని లోక్‌సత్తా పార్టీ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు దోసపాటి రాము, ప్రధాన కార్యదర్శి సాంబిరెడ్డి, ముషీరాబాద్ నియోజకవర్గ కన్వీనర్ ఎ. రాఘవయ్య ప్రశ్నించారు. గ్రేటర్‌లో సుమారు 45,000 వీధికుక్కలకు వ్యాక్సిన్ వేస్తే రూ. 25 కోట్ల దాకా ఖర్చయినట్టు చూపుతున్నారన్నారు. కూకట్‌పల్లి, ఎల్‌బీనగర్ ప్రాంతాల్లో వ్యాక్సిన్ వేసిన కుక్కల సంతతి ఇబ్బడిముబ్బడిగా పెరిగిందన్నారు. గ్రేటర్ హైదరాబాద్‌లో 5లక్షలకు పైగా వీధికుక్కలున్నాయని, ప్రజల డబ్బును ఖర్చు చేస్తూ కూడా ప్రజలకు భద్రత కల్పించలేని కార్పొరేషన్ నిర్వాకంపై విచారణ జరిపించి దోషుల్ని శిక్షించాలని వారు కోరారు.

# అక్రమాల అడ్డాగా తెలంగాణ ఖజానా శాఖ

తెలంగాణ ఖజానా శాఖ అక్రమాలకు నిలయంగా మారింది. ఎక్కడ తనిఖీ చేసినా అవకతవకలు తేలుతున్నాయి. ఖజానా కార్యాలయంలో రూ. 1644 కోట్ల మేర ఖర్చులకు సరైన ఆధారాలు లేకపోవటం నిధుల నిర్లక్ష్య వినియోగానికి అద్దం పడుతోంది. విశ్రాంత ఉద్యోగుల పింఛన్లు మొదలుకొని జీపీఎఫ్ మొత్తాలు జమచేయటం దాకా అనేక అవకతవకలు చోటుచేసుకుంటున్నాయి. ఖజానా శాఖను తక్షణం సంస్కరించాల్సిన ఆవశ్యకత తాజా ఆడిట్ సర్వేలో స్పష్టమవుతోంది.

తెలంగాణ రాష్ట్రానికి తొలి ఆర్థిక సంవత్సరమైన 2014-15లోని ఖజానా కార్యకలాపాలను అకౌంటెంట్ జనరల్ విశ్లేషించారు. అందులోని ముఖ్యాంశాలు:

వ్యయానికి సంబంధించిన ఓచర్లు చాలాచోట్ల కనిపించటం లేదు. ముఖ్యంగా విద్య, సామాజిక భద్రత, సంక్షేమం వంటి వాటిల్లో చాలా చోట్ల ఓచర్ల గల్లంతు ఉంది. ఇలా రాష్ట్రవ్యాప్తంగా రూ. 1,166 కోట్లతో ముడిపడిన 43,836 రకాల అంశాలకు ఓచర్లు లేకపోవటంతో వాటన్నిటిపైనా ఏజీ నుంచి అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి.

ఖర్చుకు సంబంధించి ప్రాథమికంగా అందచేసే ఏసీ (ఆబ్‌స్ట్రాక్ట్ కంటింజెంట్) బిల్లునే కొన్ని చోట్ల డీసీ (డీటైల్డ్ కంటింజెంట్)గా చిత్రీకరిస్తున్నారు. ఇలాంటి 3,676 బిల్లులకు సంబంధించిన రూ. 374 కోట్లను ఏజీ నిలుపుచేశారు.

కొన్ని చోట్ల పీడీ ఖాతాల్లో రూ. 1,132 కోట్ల అదనపు ఖర్చులు దర్శనమిచ్చాయి. లోటు మొత్తాలు ఉండటాన్ని బట్టి చూస్తే ఖర్చును సక్రమంగా వర్గీకరించటంలేదని భావిస్తున్నట్లు ఏజీ పేర్కొన్నారు.

బోగస్ పింఛన్లు, అనర్హులకు యూనిఫాంలు, పద్దుల నిర్వహణలో అవకతవకలు వంటివి చోటు చేసుకుంటున్నందున ఖజానాలో అక్రమాల నిరోధక విధానం ఉండాలనీ ఏజీ సిఫార్సు చేశారు. ❐

# కరవు మండలాలు సంఖ్య పెంచాలి: లోక్‌సత్తా



పంట నష్టపోయిన రైతులందరికీ పరిహారం చెల్లించాలని లోక్‌సత్తా పార్టీ తెలంగాణ అధికార ప్రతినిధి సాతులూరి గోవిందరావు డిమాండ్ చేశారు. నల్గండ జిల్లాలో ఎండిన వంట పొలాలను పరిశీలించారు. రైతు సమస్యలను పరిష్కరించటంలో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని, చాలాచోట్ల దుర్భిక్షం ఉన్నా కరవు మండలాల జాబితాలో చేర్చలేదని విమర్శించారు. వరి పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.20,000 నష్టపరిహారం ఇవ్వాలన్నారు. జిల్లాలో అన్ని మండలాలనూ కరవు మండలాలుగా ప్రకటించాలన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి రావెళ్ల రవికుమార్, శెట్టి నరేందర్, సైదాబాబు, శ్రవణ్‌కుమార్, లింగయ్య, కృష్ణ, రాము, అంజి, మోహన్‌రావు, రవి, అచ్యుత్, యాసిన్ తదితర నేతలు పాల్గన్నారు.

## రోజుకు 34 మంది రైతుల ఆత్మహత్య


2014లో దేశవ్యాప్తంగా రోజూ 34 మంది రైతులు, రైతు కూలీలు ఆత్మహత్యకు పాల్పడినట్లు ప్రభుత్వం తెలిపింది. అప్పులు, పంటదెబ్బతినటం వంటివి కారణంగా తెలిపింది. దేశంలోని పలుప్రాంతాలలో వ్యవసాయ సంక్షోభానికి ఈ పరిస్థితి తార్కాణంగా నిలుస్తోంది. 2013లో 11,772 మంది రైతులు ఆత్మహత్యకు పాల్పడగా, 2014లో ఆ సంఖ్య 12,360కి పెరిగిందని ప్రభుత్వం పార్లమెంటుకు వెల్లడించింది. జాతీయ నేరనమోదు బ్యూరో (ఎన్‌సీఆర్‌బీ) నివేదిక-2014 ప్రకారం, దివాలా లేదా అప్పులు, పంట దెబ్బతినటం, ప్రకృతి వైపరీత్యం, ఉత్పత్తుల్ని అమ్ముకోలేకపోవటం వంటి వ్యవసాయ సంబంధ సమస్యలు, పేదరికం, కుటుంబసమస్యలు, అనారోగ్యం తదితర అంశాలే ప్రధానకారణమని కేంద్ర వ్యవసాయ శాఖ రాతపూర్వక సమాధానంలో తెలిపింది. గతంలో ఆత్మహత్యలను ఎన్‌సీఆర్‌బీ 'స్వయంఉపాధి-వ్యవసాయం/సాగు' వృత్తి కింద నమోదు చేసేదని, 2014లో మాత్రం రైతులు, రైతు కూలీలనే విభాగాల కింద నమోదు చేసిందని పేర్కొంది. 2014లో 5,650 మంది రైతులు ఆత్మహత్య చేసుకోగా, 6,710మంది రైతు కూలీలు బలవన్మరణాలకు పాల్పడ్డారు. వ్యవసాయ రంగం అభివృద్ధికి ప్రాథమికంగా రాష్ట్ర ప్రభుత్వాలదే బాధ్యతని కేంద్రం వ్యాఖ్యానించింది. పథకాలు, విధానపరమైన మద్దతు, బడ్జెట్‌ల పరంగా రాష్ట్రప్రభుత్వాలకు సాయం చేస్తుందని వ్యవసాయశాఖ పేర్కొంది. 2015-16లో వేర్వేరు వ్యవసాయ పథకాల కింద కేంద్రం రూ.9,453.76 కోట్లు కేటాయించిందని ప్రభుత్వం తెలిపింది. ❒

## 'మా ఊళ్లో మా రాజ్యం' యోధుడు బీడీ శర్మ కన్నుమూత

అధికార వికేంద్రీకరణతో ఆదివాసీల హక్కుల కోసం తపించిన తొలితరం ఐఏఎస్ అధికారి డా॥ బ్రహ్మదేవ్ శర్మ కన్నుమూశారు. ఉన్నతాధికారిగానే కాకుండా 'భారత్ జన్ ఆందోళన్' వంటి సంస్థల ద్వారా కూడా 'హమారా గావ్ మే.. హమారా రాజ్' అంటూ ప్రజలకు అభివృద్ధి, న్యాయం కోసం పోరాడారాయన. మార్గం వేరైనా 'ప్రజలే ప్రభువులు...పాలకులు సేవకులే' అనే లోక్‌సత్తా లక్ష్యాన్ని రాజీలేకుండా చిట్టచివరి వరకూ తన పరిధిలో ఆచరించి చూపిన నిజమైన యోధుడు బీడీ శర్మ.

# సాంప్రదాయ రాజకీయ నేతలకు సవాల్ రోబో లీడర్లు

ఇటీవల చైనాలో డ్రీమ్ రైటర్ అనే రోబో జర్నలిస్టు 916 పదాల వార్తను కేవలం 1 నిముషంలో తప్పులు లేకుండా రాయటం పెద్ద కలకలం సృష్టించింది. చైనాలో వినియోగ సూచీ గురించిన కథనం అది. రోబోలు ఒకవేళ వార్తల్ని రాస్తే, అందునా ఆర్థికాంశాల గురించి రాస్తే గ్యారంటీగా తప్పులుంటాయని భావిస్తుండేవారమని, కానీ డ్రీమ్ రైటర్ రాసిన రిపోర్టు చూశాక చేయి తిరిగిన జర్నలిస్టు రాసినట్టే ఉందని సౌత్ చైనా మార్నింగ్ పోస్ట్‌లో పనిచేసే సీనియర్ పాత్రికేయుడు వ్యాఖ్యానించారు. రాబోయేకాలంలో సాంప్రదాయ జర్నలిస్టులకు రోబోలతో కష్టకాలమేనని పలువురు గుబులు చెందుతున్నారు.



రోబోలు సెలవలు తీసుకోవు, పని పూర్తి చేయటానికి చెప్పిన గడువును దాటవు, చాలా చక్కగా, అధ్యయనం చేసి రాస్తాయి, ఒక్కో వ్యాసానికి కేవలం 7 డాలర్లు మాత్రమే ఖర్చవుతాయి, కాబట్టి అమెరికాలో రోబో రైటర్ల వినియోగం ఇప్పటికే ఊపందు కుంటోంది. కలన గణితం ప్రాతిపదికన సాధారణ భాషలో రాసే రోబోలు తమ తప్పుల్ని దిద్దుకునే వెసులుబాటును కూడా కలిగివుంటాయని, వీటి నైపుణ్యాన్ని రాబోయేకాలంలో మరింతగా పెంచవచ్చని నివేదికలు పేర్కొంటున్నాయి. మీడియాలో ఉద్యోగాలకు గండి కొట్టటం గురించి పక్కనపెడితే, రోబోలు పక్షపాతం లేకుండా మంచి వార్తలను సమాచారంతో అందించగలిగితే ప్రజలు పెద్దఎత్తున స్వాగతి స్తారనటంలో సందేహం లేదు.

మీడియా ఫోర్త్ ఎస్టేట్. కానీ మీడియా కంటే ముందు, అంతకంటే మౌలికంగా మన జీవితాల్ని ప్రభావితం చేస్తూ, శాసిస్తున్న మిగిలిన వ్యవస్థలకు మూలమైన రాజకీయ వ్యవస్థ సంగతేమిటి? మనకు మంచి రాజకీయం లేకపోవటమే పెద్దసమస్య. సమస్యలన్నిటికీ అదే మూలం. మనమేమో మంచి రాజకీయం అవసరమేగానీ,

## స్టార్ హీరోయిన్ ఈ రోబో




ఇటీవల రోబో ఒక సినిమాలో హీరోయిన్‌గా కూడా నటించింది. ఈమె పేరు జెమినాయిడ్-ఎఫ్. రెండో ప్రపంచ యుద్ధంలో అణు దాడి తర్వాత జపాన్ ప్రజల కష్టాల్ని తెలియచేసే ఈ చిత్రం పేరు సయొనారా. జెమినాయిడ్‌కి ప్రజలంతా జేజేలు పలికారు. ఈ చిత్ర నిర్మాణానికి 72వేల యూరోలు మాత్రమే ఖర్చయ్యాయి. ఇటీవల బీజింగ్‌లో జరిగిన ప్రపంచ రోబో ఎగ్జిబిషన్‌లో ప్రధాన ఆకర్షణ జెమినాయిడే. ఐదు అడుగుల ఆరంగుళాలున్న ఈ రోబోను రబ్బరు చర్మంతో డిజైన్ చేశారు. ఈ రోబో యువతి కళ్లల్లో కళ్లు పెట్టి చూస్తుంది. ఎదుటివారి బాబీ లాంగ్వేజి, ముఖకవళికలకనుగుణంగా స్పందిస్తుంది. చక్కగా మాట్లాడుతుంది, పాడుతుంది. ఎదుటివారి మాటల్ని తిరిగి చెబుతుంది. చిరునవ్వులు చిందిస్తుంది. దీంతో జెమినాయిడ్‌కి అత్యంత అందమైన రోబోగా క్రేజ్ వచ్చేసింది. బీజింగ్ ప్రదర్శనకు వచ్చిన ఓ కుర్రాడు 'హలో జెమినాయిడ్! నీ వయసెంత' అని ప్రశ్నించగా, ఓ చిరునవ్వు విసిరి, 'మై ఏజ్ ఈజ్ సీక్రెట్. ఐ లైక్ చాటింగ్ విత్ పీపుల్' అని చెప్పి జనాన్ని ఆశ్చర్యపరిచింది. జెమినాయిడ్‌తో సెల్ఫీల కోసం ఎగబడ్డారు. జపాన్ ఒసాకా వర్సిటీ ఇషిగురో ల్యాబ్‌లో ఈ రోబో ప్రాణం పోసుకుంది. అప్పుడే టీనేజ్ దాటిన యువతిలా జెమినాయిడ్ కనిపిస్తుంది. మనుషుల ముఖ కవళికల్ని కనిపెట్టేందుకు ఈ రోబోలో త్రీడీ స్కానర్ ఉంటుంది.

నేనొక్కడినే ఓటు వేస్తే వస్తుందా? మిగిలినవారిలాగే నేనూ నా తాత్కాలిక తాయిలాల కోసం, కులం, మతం, ప్రాంతం వంటి వాటి కోసం, డబ్బు, ఆర్భాటాలతో మెరిపించే వారి కోసం, అది కూడా ఇప్పుడున్న ఎన్నికల వ్యవస్థలో గెలిచే అవకాశాలు ఉన్నవారి కోసం ఓటు వేస్తాను అంటున్నాం. అందుకే ఎంత కష్టపడుతున్నా లోక్‌సత్తా అవసరం, అనివార్యం, అజరామరం అంటున్నాంగానీ ఓట్లు వేసి మాత్రం గెలిపించలేకపోతున్నాం. ఎన్నికలచ్చే సమయానికి పూనకమొచ్చినట్టు సాంప్రదాయ పార్టీలకే ఓటు వేసి పెనం మీద నుంచి పొయ్యిలోకి పడుతున్నాం... సరే, ఇప్పుడు ఈ సాంప్రదాయ పార్టీల నుంచి లోక్‌సత్తా కొత్త రాజకీయం వైపు వచ్చే మధ్యలో రోబో నాయకులను ఎందుకు ట్రై చేయకూడదు?

అన్ని స్థాయిల్లో కాకపోయినా ప్రస్తుత రాజకీయాలలో కొన్ని పదవుల్లో రోబో లీడర్ల స్టార్టప్ ఇక ఎంతమాత్రమూ తీసిపారేయగలిగిన పరిణామం కాదు.

రోబోలు ఎంత అద్భుతంగా పనిచేసినా, ఒక సృజనాత్మకమైన జర్నలిస్టుకి సాటి రావు, అలాగే రాజకీయాలలో లోక్‌సత్తా నిత్య నూతన నిర్మాణాత్మక రాజకీయానికీ సాటిరావు. కానీ సాంప్రదాయ రాజకీయ నాయకత్వానికి మాత్రం రోబోలు ప్రత్యామ్నాయాన్ని అందించగలవు. రోబో లీడర్లను నమ్ముకుంటే గొప్ప దార్శనిక మార్పులైతే రావుగానీ, సాంప్రదాయ రాజకీయంలోపలే అవినీతి, వేధింపులు ఉండవు, పక్షపాతం ఉండదు, భద్రత ఉంటుంది, ప్రభుత్వ సేవలు నాణ్యంగా అందుతాయి, తెరవెనక లాలూచీలు, పైకి మాత్రం తీవ్ర పరస్పర ఆరోపణల నాటకాలు ఉండవు. కఠిన చట్టాల అవసరం, వాటిని దుర్వినియోగం చేస్తారనే భయం, విలువైన వనరుల దోపిడీ ఉండదు. ప్రజలకు దిక్సూచిల్లా నాయకత్వం అందించే బాధ్యత తీసుకోకుండా, జనం కోరుకుంటున్న పాలనే అందిస్తున్నాం తప్ప మా తప్పేం లేదు అంటూ దోచుకునే యాంత్రిక, మొక్కుబడి నాయకుల కంటే రోబోలు చాలా మేలు. అంటే, ఇప్పుడు నడుస్తున్న పాలనకంటే రోబోల నేతృత్వంలో చాలా మెరుగైన పాలనే లభిస్తుందన్న మాట.


ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దగ్గర్నుంచి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రులు కె.చంద్రశేఖరరావు, చంద్రబాబు నాయుడు వరకూ ఇప్పటికే డిజిటల్ ఇండియా కోసం వేగంగా దారులు పరుస్తున్నారు. మోదీ సిలికాన్ వేలీకి ప్రత్యేకించి వెళ్లి



మనదేశాన్ని డిజిటలైజ్ చేసే కృషిలో భాగస్వాములయ్యేలా పలుకంపెనీల్ని ఒప్పించారు. హైదరాబాద్‌లో డిజిటల్ ఆవిష్కరణల కోసం ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేసి మరీ ప్రోత్సహిస్తున్నారు. చంద్రబాబు ఏకంగా రోబోల తయారీ సహా వివిధ విభాగాలలో సాంకేతిక దిగ్గజాలైన జపాన్, సింగపూర్‌లను ప్రత్యక్ష వ్యాపారాలకు ఆహ్వానించారు. కాబట్టి రోబో లీడర్లకు కార్యక్షేత్రం సిద్ధమవుతోంది. కాబట్టి, సాంప్రదాయ రాజకీయం నుంచి లోక్‌సత్తా నూతన రాజకీయంలోకి మారటానికి మనకేమన్నా శంకలు, వంకలు ఉంటే, ఈలోగా సాంప్రదాయ రాజకీయం లోపలే రోబో లీడర్ల నియామకాన్ని పరిశీలించవచ్చు. కొన్ని పదవుల్లో ఎన్నికైన నాయకులు లేకుండా రోబో లీడర్లను ఏర్పాటు చేసుకోవచ్చు.

మన సాంప్రదాయ ప్రజాప్రతినిధులు చేసే పనులన్నీ రోబో లీడర్లు అలవోకగా చేసేయగలుగుతారు. చూడండి.

మనం ఎన్నుకున్న కార్పొరేటర్, ఎమ్మెల్యే, ఎంపీ, ఆ మాటకొస్తే మంత్రి ఏం చేస్తున్నారు? పొద్దున్నే లేచి ఆ రోజు కార్యక్రమాలను చూసుకోవటం, ప్రజల వినతిపత్రాలు తీసుకోవటం, ప్రభుత్వ కార్యాలయాల్లో పనులు చేసిపెట్టేందుకు అధికారిక దళారీలా వ్యవహరించటం, అధికారులు, వచ్చినవారితో మీటింగుల్లో, మీడియా సమావేశాలలో ఏం మాట్లాడాలో సహాయకుల నుంచి తీసుకోవటం వగైరాలు అధికారికంగా చేస్తారు. ఇక లంచాలు, దందాలు, కబ్జాలు,



రాజకీయ లాలూచీలు, ఆశ్రిత పక్షపాతాలు వంటివి రహస్యంగా చేస్తారు. ఏవైనా దురదృష్టకర సంఘటనలు జరిగితే పరామర్శించి కడివెడు కన్నీరు కార్చినట్టు నటిస్తూ ఎక్స్‌గ్రేషియా ప్రకటిస్తారు. పెళ్లిళ్లు, పేరంటాలు, పండగలు ఉంటే మీలో ఒకడినే అన్నట్టుగా చిందేస్తూ మురిపిస్తారు. స్థానికంగా నేనే నాయకుడిని అన్నట్టుగా గల్లీ పనుల్లో కూడా వేళ్లు పెడతారు. ప్రజలకు వండివడ్డించి తినిపిస్తున్నట్టుగా ఫోజులిస్తారు. మీడియాలో అవకాశమున్నచోట వాలిపోతుంటారు. చట్టసభల సమావేశాలున్నప్పుడు మాట్లాడటానికి ఏమీ ఉండదు కాబట్టి, సమావేశాలను అడ్డుకోవటం లేదా తాము ఆచరించని ఆదర్శాలను ఏమాత్రం సిగ్గుపడకుండా వల్లిస్తుంటారు. ఫ్లెక్సీలు, కటౌట్లు పెట్టుకుంటుంటారు. సోషల్ మీడియాలో పోస్టింగులు, రియాక్షన్లు, ఇతరత్రా ప్రచారాలు చేస్తుంటారు. ఇదేగదా ప్రజల మనుషులుగా చెప్పుకునే చాలామంది ఎన్నికైన నాయకుల రోజువారీ కార్యకలాపాలు. ఇవన్నీ రోబో లీడర్లు చేయలేరా?

రోజువారీ పాలన,

ప్రెస్ మీట్లు,

సోషల్ మీడియా పోస్టింగులు,

పరామర్శలు,

పర్యటనలు, మీటింగులు,

సమీక్షలు,

ఊకదంపుడు ఉపన్యాసాలు,

పంచ్ డైలాగులు,

ఈవెంట్ మేనేజ్‌మెంట్లు

ఇవన్నీ చేయటంతోపాటు సాంప్రదాయ నేతలు చేయలేని అనేక ప్రజోపకరమైన పనుల్ని కూడా రోబో లీడర్లు చేస్తారు. అవేంటంటే...

- రోబో లీడర్లకు అవినీతి ఉండదు
- కులం, మతం వంటి విద్వేషాల్ని రెచ్చగొట్టకుండా రాజ్యాంగబద్ధంగా, నిజాయతీగా వ్యవహరిస్తారు
- పార్టీలు ఫిరాయించరు, తమ పార్టీయే ఆదేశించినా సరే తప్పుడు విధానాలకు తలగ్గరు
- వంశపారంపర్య రాజకీయాలు, ఆశ్రిత పక్షపాతం ఉండదు
- విలాసాలు, ఆడంబరాలు, ప్రత్యేక విమానాలు అడగరు
- మీడియా కవరేజీలు, సొంత మీడియాల ఏర్పాటు కోసం వెంపర్లాడరు
- టీవీ చర్చల్లో యుద్ధవాతావరణాలు, జనాన్ని మోసం చేసే హైడ్రామాలు ఉండవు
- మేనిఫెస్టోల్లో చెప్పిన మాటలకి కట్టుబడి ఉంటారు
- చెప్పిన పనిని నిర్ణీత కాలవ్యవధిలో పూర్తిచేస్తారు, ప్రజాధనం ఆదా చేస్తారు
- ఎన్నికల్లో బ్లాక్ మనీ ఖర్చు చేయరు
- సామాజిక మాధ్యమాల్లో ప్రచార కాలుష్యం తగ్గిస్తారు

ఈవేళ్టి ప్రజల అవసరాలను తీరుస్తూ రేపటి ఉన్నత భవిష్యత్తుకి ఎలా నిర్మాణం చేయాలి, స్థానిక జీవనాన్ని జాతీయ భావాలతో, అంతర్జాతీయ జీవనంతో ఎలా సంధానం చేయాలి, వ్యక్తి సుఖాన్ని, సమాజ హితాన్ని ఎలా సమన్వయం చేయాలి, అంతిమంగా చిట్టచివరి పౌరునికి కూడా సాధికారతనిచ్చే పాలనని ఎలా అందించాలి... వీటికనుగుణంగా విధానాలను



పరిమిత వనరులలో ఎలా సృజనాత్మకంగా రూపొందించాలి వంటివేమీ ఈ సాంప్రదాయ రాజకీయ నేతలలో ఎక్కువమందికి ఉండవు. కాస్తోకూస్తో ఆలోచన ఉన్నవారు కూడా వ్యవస్థకు తలగ్గి ప్రభావశూన్యంగా మారి పోతుంటారు. మరి పెద్దగా ఆలోచనలేకుండా, రొటీన్‌గా, యాంత్రికంగా, మొక్కుబడిలాగా పనిచేసే నాయకుల వల్ల లక్షల కోట్ల రూపాయల జాతి సంపదను మనం కోల్పోతూ, దుష్పరిపాలన అనుభవించే కంటే... రోబో లీడర్లను నియమించుకుంటే ప్రజలకు లాభసాటి కాదా? అంతిమంగా ప్రజాస్వామ్యంలో ప్రజలమే ప్రభువులం, మనకు సేవ చేయటానికే మనం రాజకీయ నాయకులను ఎన్నుకుంటున్నాం. వారి కంటే రోబోలు ఎక్కువగా సేవలందించగలిగినప్పుడు ఎందుకు రోబో లీడర్లవైపు మనం మొగ్గుచూపకూడదు?

ప్రజలు తమకు కావలసిన ఎజెండా, రాజ్యాంగ ప్రజాస్వామ్య పద్ధతులు, విలువల సాఫ్ట్‌వేర్‌తో రోబోను రూపొందించుకోవచ్చు. మెరుగైన రోబోల ఎంపిక కోసం వేలంపాటలు, ఓటింగ్ వంటి కొన్ని ఏర్పాట్లు చేసుకోవచ్చు. సాంకేతిక నేరాల వల్ల హ్యాకింగ్‌లు జరగకుండా కొన్ని ముందు జాగ్రత్త చర్యల్ని తీసుకోవచ్చు. ఈ విషయాల్లో సిలికాన్ వ్యాలీ వంటి చోట్ల మేరా భారత్ మహాన్ అంటూ కీర్తిస్తుండే ఎన్నారైలు సహకారాన్ని అందిస్తారనటంలో సందేహం లేదు. వీటన్నిటినీ పర్యవేక్షించేందుకు నిజాయతీ, సమర్థత గలవారితో బృందాలను ఏర్పాటు చేయవచ్చు.

అలాగే ప్రభుత్వ కార్యాలయాల్లో కూడా. మనకు సేవకులుగా ఉండాల్సిన ప్రభుత్వోద్యోగులు మనల్ని బానిసల్లాగా చూస్తూ, లంచాలు గుంజుతూ వేధిస్తుంటే, వారితో కుమ్మక్కయిన రాజకీయ నేతలు హక్కుగా పౌరసేవలందించేందుకు సర్వీస్ గ్యారంటీ చట్టాన్ని అమలు చేసే సాహసం చేయకుండా ఉంటే, ఎల్లకాలం సహిస్తూండాలా? రోబో అధికారుల్ని కొన్ని చోట్లయినా ప్రారంభించుకోవటంలో తప్పేం లేదు.

రాజకీయ పార్టీలు కూడా తక్కువ ఖర్చుతో ఎక్కువ ఫలితాల కోసం రోబో కార్యకర్తలు, లీడర్ల సేవలను వినియోగించుకోవచ్చు.

రాబోయే రోజుల్లో మరమనుషుల స్థాయి నుంచి మనిషిని అన్నిరకాలుగా పోలి ఉండే రోబోలు వచ్చేస్తాయంటున్నారు. కృత్రిమ మేధస్సుతో ఈ ఆండ్రాయిడ్ మనుషుల తయారీకి రష్యన్ కోటీశ్వరుడు దిమిత్రి ఇట్సుకోవ్ ఏకంగా ఒక ప్రాజెక్టునే ప్రారంభించారు. అవతార్ సినిమాలోలాగా 2045 నాటికి ఆండ్రాయిడ్ మనుషుల్ని పూర్తిస్థాయిలో తయారుచేసి మనిషిని శాశ్వతం చేయాలన్నది ఆయన సంకల్పం. అప్పటిదాకా కూడా మనం ఆగనక్కర్లేదు. రోబో లీడర్లను రాజకీయాలలో మొదలుపెట్టవచ్చు, విస్తరించవచ్చు. మరోవైపు, హ్యూమనాయిడ్ రోబోల వల్ల అన్ని రంగాలలో ఉద్యోగాలకు రాబోయేకాలంలో పెనుపోటీ పొంచి ఉందని మనం గుర్తించాల్సిన సమయం ఆసన్నమైంది. సాంప్రదాయ, యాంత్రిక రాజకీయ నేతల కంటే రోబో లీడర్లు ఎలాగైతే బెటర్ అనుకుంటున్నామో, అలాగే సాధారణ, మొక్కుబడి పనితీరు కనబరిచే మనలోని చాలామంది కంటే రోబో వర్కర్లు బెటరని భావించే రోజులు వస్తాయి. సృజనాత్మక నిర్మాణాత్మకతతో పనిచేస్తేనే రాజకీయాలలో లోక్‌సత్తాలాగా రోబోల పోటీని అధిగమించి మనగలుగుతాం. ❐

# ఆడపిల్లను బతకనిద్దాం.. ఎదగనిద్దాం

- కూసంపూడి శ్రీనివాస్
లోక్‌సత్తా పార్టీ ఏ.పి అధికార ప్రతినిధి



నరేంద్ర మోదీ ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత చేపట్టిన ప్రజాహిత కార్యక్రమాల్లో బేటీ బచావో... బేటీ పఢావో (ఆడపిల్లల్ని కాపాడండి, ఆడపిల్లల్ని చదివించండి) ముఖ్యమైనది. ఈ పథకాన్ని హర్యానాలో ప్రారంభించినప్పుడు ఆయన మాట్లాడుతూ, భ్రూణ హత్యలు, లింగవివక్ష అనే నేరాలు చేస్తూ మనల్ని మనం 21వ శతాబ్దపు పౌరులుగా చెప్పుకోలేం. 18వ శతాబ్దపు మనుషులకన్నా నీచస్థితిలో ఉన్నామని చెప్పుకోవచ్చు. 18వ శతాబ్దంలో ఆడపిల్లని కనీసం కొన్నాళ్లయినా బతకనిచ్చేవారు, ఇప్పుడు మన బిడ్డల్ని తల్లిగర్భంలో ఉండగానే చంపేస్తున్నాం. ఇది ఎంత దారుణం అంటూ ఉద్వేగంగా వ్యాఖ్యానించారు. నిజమే... ఒకప్పుడు ఆడపిల్ల పుడితేనే మహాలక్ష్మి పుట్టిందని అనుకునేవారు. ఇప్పుడు ఆ రోజులు పోయాయి. ఆడపిల్ల అంటేనే మైనస్ అని కొందరు తల్లిదండ్రుల భావన. అందుకే ప్రభుత్వ పథకాలు పెట్టుకుని మరీ ఆడపిల్లని కాపాడుకునే దుస్థితికి దిగజారిపోయాం. నిజానికి కేవలం చంపబడటానికే ఈ భూమ్మీదకు వస్తున్న జీవి ఏదైనా ఉందంటే అది కేవలం ఆడశిశువే. ఆడవారిని దేవతలతో పోల్చే మన భారతదేశంలో నిత్యం ఎంతమంది ఆ దేవతలని మన చేతులతో మనమే చంపుతున్నామో గణాంకాలు చూస్తే మనం ఆధునిక కాలంలో ఉన్నామో, ఆటవిక కాలంలో ఉన్నామో అర్థమవుతుంది.

గడచిన రెండు దశాబ్దాలలో భారతదేశంలో గల్లంతైన ఆడపిల్లల సంఖ్య సుమారు 3 కోట్లు. అంతేకాకుండా గర్భసంచుల్లోనే మనం చంపి పాతరేసిన ఆడశిశువుల సంఖ్య దాదాపు కోటి. దేశంలోని కొన్ని ప్రాంతాలలో ప్రతీ వెయ్యిమంది అబ్బాయిలకు 591మంది అమ్మాయిలు ఉన్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. సంవత్సరానికి ఇంచుమించు 10లక్షల భ్రూణ హత్యలు జరుగుతున్నాయి. ఇది గత ముప్పై సంవత్సరాలుగా జరుగుతున్న మారణహోమం. దాదాపు ఇప్పటిదాకా దాదాపు 3కోట్లమంది ఆడపిల్లలు పుట్టకముందే చచ్చిపోయారు. తల్లిగర్భంలోనే రక్తపుటేరులు పారించే ఈ భ్రూణ హత్యలకు మెడికల్ టెర్మినాలజీలో పెట్టుకున్న పేరు 'ఇంటెన్షనల్ అబార్షన్స్'. అయినా పుట్టబోయే బిడ్డ ఆడో, మగో నిర్ణయించే శక్తి అమ్మ అందానికి లేదు. మగవారి వీర్యకణమే ఇక్కడ నిర్ణయాత్మకం. అయినా సరే ఈ విషయంలో ఆడవాళ్లనే దోషుల్ని చేస్తుంది మన సమాజం. పోనీ ఈ విధంగా భ్రూణ హత్యలకు పాల్పడుతున్నది చదువులేని వారు కూడా కాదు. అందరూ చదువుకున్నవారే. 2001 జనాభా లెక్కల ప్రకారం 1000 మంది బాలురకి 970 మంది బాలికలు ఉన్నారు. 2011 జనాభా లెక్కల ప్రకారం ఇది కాస్తా 961కి పడిపోయింది. ప్రతీరోజు మనదేశంలో చట్టవిరుద్ధంగా 2000 స్త్రీ శిశు గర్భస్థ స్రావాలకు పాల్పడుతున్నట్టు ఐక్యరాజ్యసమితి ఒక నివేదికలో పేర్కొంది. భారతదేశంలో అతితక్కువ స్త్రీ, పురుష నిష్పత్తులున్న రాష్ట్రాల్లో హర్యానా, పంజాబ్, జమ్మూకాశ్మీర్, రాజస్థాన్, మహారాష్ట్ర, గుజరాత్‌లు ముందజలో ఉన్నాయి. మన ఉమ్మడి రాష్ట్రంలో బాలుర సంఖ్య 47లక్షల 14వేల 950 అయితే, బాలికల సంఖ్య 44లక్షల 27వేల 852 ఉంది. గడచిన పది సంవత్సరాలలో అమ్మాయిల సంఖ్యలో తీవ్ర వ్యత్యాసం కనబడుతుంది. గత ఆరు సంవత్సరాలలో 78వేల ఆడ శిశువులు భ్రూణ హత్యలకి గురయ్యారు.

1994లో పిండ నిర్ధారణ పరీక్ష నిషేధిత చట్టం అమల్లోకి తీసుకొచ్చింది అప్పటి ప్రభుత్వం. ఈ చట్టంలో అనేక లసుగులు ఉండటంతో 2003లో సవరించారు. ఈ చట్టం ప్రకారం లింగ నిర్ధారణ పరీక్ష నిర్వహించే వ్యక్తులు, సంస్థలు, వైద్యులు జిల్లా స్థాయిలో వైద్య ఆరోగ్య శాఖ అనుమతి తీసుకోవాలి. స్కానింగ్

పరీక్షలు, అల్ట్రా సౌండ్ స్కానింగ్ యంత్రాలు, లింగ నిర్ధారణ యంత్రాలు ఈ చట్టపరిధిలోకి వస్తాయి. కానీ ఈ చట్టం పట్ల ప్రజలలో సరైన అవగాహన లేదు. అన్నీ తెలిసిన వైద్యులేమో కాసులకి కక్కుర్తి పడి పిండాన్ని కనిపెట్టటం, తరువాత చిదిమేయటం ఒక ప్యాకేజీగా మాట్లాడుకుంటున్నారు. ఈ బిజినెస్ సంవత్సరానికి అక్షరాల 3వేల కోట్ల రూపాయలు. రాష్ట్రంలో అధికారికంగా 7,319 స్కానింగ్ సెంటర్లు ఉంటే, అనధికారికంగా ఉన్న సెంటర్లకి లెక్కే లేదు. ఆడపిల్లల్ని బలి తీసుకునే ఈ దాష్టీకం ఒక్క మనదేశంలో ఎక్కువగా కనిపిస్తుంది.

ఇలా ఆడపిల్లల్ని చంపే నీచ సంస్కృతికి మన సమాజం ఎందుకు దిగజారుతుందో కూడా ఆలోచించాలి. మనది పురుషాధిక్య సమాజం. మన సమాజంలో స్త్రీ, పురుషుల మధ్య వివక్ష అనాదిగానే ఉంది. పాతరోజుల్లో కన్యాశుల్కం పేరిట జరిగే బాల్య వివాహాలు కొంతవరకు ఆపుకోగలిగాం. కానీ, వరకట్న సమస్య పెరిగిపోతూనే ఉంది. పుట్టినప్పటి నుంచి ఆడపిల్లలకు, మగపిల్లలకు మధ్య తేడాలు కనిపిస్తున్నాయి. ఆడపిల్లలు సుకుమారంగా, అందంగా ఉండటమే ముఖ్యమని కుటుంబంలో తల్లిదండ్రులే మొట్టమొదట నేర్పిస్తారు. వారు సదా మగవారి రక్షణలో ఉండాలని, అలా లేకుంటే వారు అత్యాచారాలకు గురవుతారని చెబుతున్నారు. అదే కుటుంబం, మగపిల్లలకు మాత్రం అందం కన్నా, ధైర్యం ముఖ్యమని, వారు బలంగా ఉండాలని, తమ ఆడపిల్లల్ని కాపాడే బాధ్యత వారిదేనని నేర్పిస్తుంది. ఈ విధంగా కుటుంబం, సమాజం ఆడపిల్లలను శారీరకంగా పూర్తి బలహీనంగా తయారుచేస్తున్నప్పుడు, ఆమెకు స్వీయరక్షణ అవకాశం ఎక్కడుంటుంది?

వివాహం తర్వాత ఆడవాళ్లు ఒక కుటుంబం నుంచి మరో కుటుంబంలోకి మార్పిడి అవుతారు. వివాహం జరిగాక ఆడవాళ్లు తమ జన్మ సంబంధాల్ని వదులుకొని మగవాడి వెంట వెళ్లటం వల్ల తమ పూర్వ సంబంధాల విచ్ఛిత్తి మూలంగా వాళ్లు తమ భర్తలపైన అన్ని విషయాలకీ ఆధారపడతారు. ఇలా ఆధారపడటంలోని ద్వంద్వ నీతిని గమనించకుండా ఉండటం కోసమూ, ప్రశ్నించకుండా ఉండటం కోసమూ ధర్మాలూ, పాతివ్రత్యమూ, దాన్ని మూలంగా చేసుకుని చెలామణి అవుతున్న ఇతర భావజాలమూ పురుషులకు పనికివస్తాయి. అయితే అటువంటి యువకులకి మాత్రం భార్యలాగా వివాహం వల్ల తన జన్మ సంబంధాలకి దూరమయ్యే అవసరం సాంస్కృతికంగా ఉండదు. పెళ్లి కాగానే ఆడవాళ్లు అంతవరకూ ఉన్న ఇంటిపేరును మార్చుకోవడం, తాను ఎంత చదువుకుని సాంఘికపాత్రని సమర్థవంతంగా నిర్వహించినప్పటికీ అవేమీ చేయకుండా, కుటుంబమూ, భర్తా తనకి నిర్దేశించిన స్థానంలో ఇమిడిపోవటమూ మనం చూస్తూనే ఉన్నాం. అలాకాకుండా స్త్రీలు చొరవ తీసుకుని నిర్ణయాలు తీసుకున్నట్టు కనిపిస్తే వారిని సాంప్రదాయాన్ని ధిక్కరించినవారుగానూ, నమ్రత లేని వాళ్లుగానూ గుర్తించటం మనం గమనించవచ్చు. అందువల్ల ఆ ఇబ్బందులేవీ ఎదుర్కోవడానికి ఆడవాళ్లు ఎక్కువగా సంసిద్ధులు కారు. అంతేకాకుండా అమ్మాయిలు విద్యలో రాణించి ఉద్యోగాలు చేస్తున్నప్పటికీ, పురుషులతోపాటు సంపాదిస్తున్నప్పటికీ కట్నం ఇవ్వటం అనేది తప్పటం లేదు. దీనివల్ల ఆడవాళ్ల స్థానం సహజంగానే వెనక్కి నెట్టివేతకు గురవుతూ ప్రాముఖ్యతని కోల్పోతుంది.

మన నాగరికతకు ప్రాణం పోసేది ఆడదే. అటువంటి ఆడపిల్లని పుట్టగానే కన్న తల్లిదండ్రులే అమ్మేస్తున్నారు. వీధి పాలు చేస్తున్నారు లేదా హత్యలు చేస్తున్నారు. కేవలం ఆడపిల్లగా పుట్టిన పాపానికి ఈ సమాజంలో నిత్యం అవమానాలకి, అఘాయిత్యాలకి గురవుతున్నారు. ఒకవేళ ఆడపిల్లగా ఎదిగినా జీవిత భాగస్వామిని కూడా ఎంపిక చేసుకునే హక్కు లేదు. అలా కాని చేస్తే, కన్నవాళ్లే కసాయి వాళ్లుగా మారి పరువు హత్యలకి పాల్పడుతున్నారు. ఇలా మరెన్నో అడ్డంకులను, హింసలను ప్రతిరోజూ వీరు అనుభవిస్తూనే ఉన్నారు. అయినా ఆడపిల్లలు లేని సమాజాన్ని ఊహించగలమా? వీరి అభివృద్ధిని కుంటుపరచటం అన్యాయం. భవిష్యత్తులో అమ్మాయిలూ, అబ్బాయిలూ సమానస్థాయిలోకి రావాలంటే ప్రభుత్వం సమగ్రమైన కార్యాచరణను రూపొందించాలి. లేదంటే అమ్మాయిల శాతం తగ్గి సమాజంలో అమ్మాయిలపై అఘాయిత్యాలు పెరిగే అవకాశం ఉంది.

రాణి రుద్రమ, ఝాన్సీ లక్ష్మీ, మదర్ థెరిస్సా, ఇందిరాగాంధీ వంటి మహిళలు ఎందరో స్త్రీ జాతి శక్తిని చాటారు. నేటి ప్రపంచంలో ఎందరో మహిళలు వీరజవాన్లుగా, పైలెట్లుగా, శాస్త్ర, సాంకేతిక రంగంలో తమ నైపుణ్యాన్ని అవరోధాల మధ్య కూడా నిరూపించుకుంటున్నారు. స్త్రీలు కూడా ఈ సమాజ నిర్మాణంలో సగభాగమని, వారికి సొంత అభిప్రాయాలు ఉంటాయని, వాటిని గౌరవించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిదీ అని గుర్తించే సమాజం కోసం మనమందరం కృషి చేయాలి. అలాంటి రాజకీయాన్ని ప్రోత్సహించాలి. ఆడపిల్లను బతకనిద్దాం, గౌరవిద్దాం, ఎదగనిద్దాం. ❐

(కర్టెసీ: మన తెలంగాణ)

# 'వైవాహిక రేప్' క్రిమినల్ నేరం కాదన్న ప్రకటనను కేంద్రం ఉపసంహరించుకోవాలి: లోక్‌సత్తా

**మహిళల పట్ల తమ వివక్షను కప్పిపుచ్చుకోవటానికి కేంద్ర ప్రభుత్వం భారతీయ సంస్కృతిని అడ్డం పెట్టుకుంటోందని లోక్‌సత్తా పార్టీ జాతీయ అధ్యక్షుడు సురేంద్ర శ్రీవాస్తవ ధ్వజమెత్తారు. "ఆత్మపరిశీనలతో దిద్దుబాటు చేసుకోవటం భారతీయ సంస్కృతిలో భాగం. జీవించు, జీవించనివ్వు అని బోధించే ఈ సంస్కృతే అనేక అసంబద్ధ చట్టాలను రద్దు చేసి సామాజిక న్యాయాన్ని పరిరక్షించే అనేక కొత్త చట్టాలను తీసుకురావటానికి దోహదం చేసింది. అత్యాచారం అనేది ఎటువంటి పరిస్థితుల్లోనైనా హేయమైనదే. వైవాహిక బంధంలో రేప్‌ని సహించాల్సిందేనంటే, మహిళలు తక్కువస్థాయి మనుషులు, వాళ్లకు తమ శరీరాల మీద, భావాల మీద ఎటువంటి హక్కూ లేదు, బాధని, హింసను సహిస్తూ పడివుండాల్సిందేనని ప్రతిరోజూ సర్కారే చెబుతున్నట్టు లెక్క. ఒక న్యాయవాదిగా, మనిషిగా భారత ప్రభుత్వ ఈ తీరుని నిర్ద్వంద్వంగా తిరస్కరిస్తున్నా" అన్నారు.**

భార్యతో బలవంతపు సెక్స్‌ని భారత్‌లో క్రిమినల్ నేరంగా చూడలేమని చేసిన ప్రకటనను ఉపసంహరించుకున్నామని కేంద్ర ప్రభుత్వం విస్పష్ట ప్రకటన చేయాలని లోక్‌సత్తా పార్టీ డిమాండ్ చేసింది. మహిళల కనీస మానవ హక్కుల్ని, రాజ్యాంగం వారికి అందించిన ప్రాథమిక హక్కుల్ని పరిరక్షించే బాధ్యత నుంచి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నిస్సిగ్గుగా తప్పించుకుంటోందని, ప్రభుత్వపరమైన తన బాధ్యతలను నిర్వర్తించటానికి భారతీయ సంస్కృతి అవరోధంగా మారిందన్నట్టు బూటకపు వాదనను వినిపిస్తోందని ధ్వజమెత్తింది.


"అత్యాచారం లేదా పరస్పర అంగీకారం లేని సెక్స్ అంటేనే హింస అని అర్థం. భారతీయ సంస్కృతిలో వివాహ వ్యవస్థ పవిత్రమైనదని, కాబట్టి భార్యాభర్తల మధ్య హింస, బలవంతపు సెక్స్‌ను నేరంగా భావించలేమని చెప్పటం విరుద్ధమైన, హాస్యాస్పదమైన వాదన. భారతదేశ ప్రతిష్ఠను దిగజార్చేలా ప్రభుత్వం వ్యవహరిస్తోంది" అని లోక్‌సత్తా పార్టీ పేర్కొంది.

మహిళల పట్ల తమ వివక్షను కప్పిపుచ్చుకోవటానికి కేంద్ర ప్రభుత్వం భారతీయ సంస్కృతిని అడ్డం పెట్టుకుంటోందని లోక్‌సత్తా పార్టీ జాతీయ అధ్యక్షుడు సురేంద్ర శ్రీవాస్తవ ధ్వజమెత్తారు. "ఆత్మపరిశీనలతో దిద్దుబాటు చేసుకోవటం భారతీయ సంస్కృతిలో భాగం. జీవించు, జీవించనివ్వు అని బోధించే ఈ సంస్కృతే అనేక అసంబద్ధ చట్టాలను రద్దు చేసి సామాజిక న్యాయాన్ని పరిరక్షించే అనేక కొత్త చట్టాలను తీసుకురావటానికి దోహదం చేసింది. అత్యాచారం అనేది ఎటువంటి పరిస్థితుల్లోనైనా హేయమైనదే. వైవాహిక బంధంలో రేప్‌ని సహించాల్సిందేనంటే, మహిళలు తక్కువస్థాయి మనుషులు, వాళ్లకు తమ శరీరాల మీద, భావాల మీద ఎటువంటి హక్కూ లేదు, బాధని, హింసను సహిస్తూ పడివుండాల్సిందేనని ప్రతిరోజూ సర్కారే చెబుతున్నట్టు లెక్క. ఒక న్యాయవాదిగా, మనిషిగా భారత ప్రభుత్వ ఈ తీరుని నిర్ద్వంద్వంగా తిరస్కరిస్తున్నా" అన్నారు.

లోక్‌సత్తా పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్‌పర్సన్ తార కె మాట్లాడుతూ, భారతీయ సంప్రదాయం, సంస్కృతి, విద్య, భారతీయుల నేపథ్యం వంటి వాటి పేరుతో ఇంతకుముందున్న ప్రభుత్వాలు వరకట్నం, బాల్యవివాహాలు, వితంతువుల సహగమన నిషేధం వంటి చట్టాలను అడ్డుకునే ప్రయత్నం చేయలేదని, ప్రస్తుత ప్రభుత్వంలాగే గత ప్రభుత్వాలు కూడా తామే భారతీయ సంస్కృతికి సర్వ సంరక్షకులమన్నట్టు వ్యవహరించి వుంటే, ఇక ఇటువంటి ఆటవిక సంప్రదాయాలు ఎన్నటికీ తొలగిపోవు" అన్నారు.

కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా తన ఛాందస ధోరణి నుంచి బైటికొచ్చి వైవాహిక అత్యాచారాన్ని క్రిమినల్ నేరంగా గుర్తించాలని, మహిళల్ని ప్రథమ శ్రేణి పౌరులుగా గుర్తించాలని, వారికి ఆత్మగౌరవం గల జీవితాన్ని, సేఫ్ అండ్ హ్యాపీగా ఉండే వివాహ వ్యవస్థను అందించాలని, మహిళల సాధికారత కోసం రాజీలేని పోరాటం చేసే పార్టీగా లోక్‌సత్తా డిమాండ్ చేసింది. ❐

# ప్రజల పన్నుల డబ్బు ఏమవుతోంది : కమల్ ఆవేదన



ప్రజలు కట్టే పన్నుల డబ్బు ఏమవుతోంది? ప్రజలకు ఎందుకీ అవస్థ? అని సినీ దిగ్గజం కమల్ హాసన్ ప్రశ్నించారు. చెన్నైలో భారీ వర్షాలకు, వరదలకు ప్రజలు పడుతున్న అవస్థల పట్ల కమల్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఇది మానవ తప్పిదమని ప్రభుత్వాన్ని ఎండగట్టారు. సురక్షితమైన ఇంట్లో కూర్చుని చెన్నై ప్రజలు పడుతున్న కష్టాల్ని చోద్యంలా చూడటం ఎంతో సిగ్గనిపించిందన్నారు. ప్రజలు కడుతున్న పన్నుల డబ్బుల్ని ఏం చేస్తున్నారని పాలకుల్ని, అధికారుల్ని నిలదీశారు. తాను కష్టపడి సంపాదిస్తున్న డబ్బుకి సక్రమంగా పన్ను కడుతున్నానని, అయితే అవి సరైన చోటుకి వెళ్లటం లేదని, సద్వినియోగం కావటంలేదని ఈ వరదలతో తేలిపోయిందని అన్నారు. "నాకు దేవుడిపై నమ్మకం లేదు. తమను తామే దేవుళ్లుగా చెప్పుకునే రాజకీయ నేతలపై కూడా నమ్మకం లేదు. ప్రజల్ని ఆదుకునేందుకు ఉన్నామనే సంగతిని ప్రభుత్వాలు మర్చిపోతున్నాయి. ప్రభుత్వం కంటే నేను తక్కువగానే సంపాదిస్తున్నా. అయినా సాయం చేయటం నా బాధ్యతని తెలుసు. ఖచ్చితంగా చేస్తాను కూడా. ఇది ప్రజల రక్తాన్ని పీల్చి సంపాదించిన డబ్బు కాదు. ప్రజలను నిజాయతీగా ప్రేమించే ఒక భారతీయ పౌరుడి కష్టం. ప్రభుత్వం అందరినీ సమానంగా చూడాలి" అని కమల్ హాసన్ అన్నారు. ❐



# న్యాయవ్యవస్థకు గట్టి సందేశం ఇవ్వాలి: ఎంపీలు

జాతీయ న్యాయనియామకాల సంఘం (ఎన్ఏజేసీ) చట్టాన్ని సుప్రీంకోర్టు కొట్టివేయటంపై లోక్‌సభ సభ్యులు తీవ్రంగా అభ్యంతరాలు వ్యక్తం చేశారు. న్యాయమూర్తులకు జవాబుదారీతనం ఉండాల్సిందేనని, ఇప్పుడున్న కొలీజియం వ్యవస్థ అప్రజాస్వామికమని ఎంపీలంతా ముక్తకంఠంతో పేర్కొన్నారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తుల (వేతనాలు, షరతులు) సర్వీసు సవరణల బిల్లు, 2015పై చర్చ సందర్భంగా ఎన్‌జేఏసీపై పలువురు ఎంపీలు మాట్లాడారు. మూజువాణి ఓటుతో ఆమోదం పొందిన ఈ బిల్లుతో ఉన్నత న్యాయమూర్తులకు మెరుగైన జీతభత్యాలు అందుతాయి. సమాచార హక్కు చట్టం కిందకు వచ్చేందుకు న్యాయమూర్తులు సిద్ధంగా లేకున్నా, వారిని సంతృప్తిపరిచేందుకు ఈ బిల్లు తీసుకొచ్చారంటూ బీజేడీ ఎంపీ తథాగత సత్పతి ప్రభుత్వాన్ని విమర్శించారు. బీజేపీ సభ్యుడు ఆర్‌కే సింగ్ మాట్లాడుతూ, పార్లమెంటు పరిధిని అతిక్రమించకుండా న్యాయస్థానాలకు గట్టి సందేశం వెళ్లాల్సిన అవసరముందన్నారు. సుప్రీంకోర్టు, హైకోర్టులకు న్యాయమూర్తుల నియామక ప్రాతిపదికను, ప్రక్రియను పర్యవేక్షించే అధికారం రాజ్యాంగ పరిధిలో పార్లమెంటుకు ఉందని న్యాయమంత్రి సదానంద గౌడ స్పష్టం చేశారు. ఎన్‌జేఏసీకి సంబంధించినంత వరకు తుదితీర్పు ఇంకా రాలేదని, సుప్రీంకోర్టు కొన్ని సూచనలు కోరిందని, దీనిపై చర్చించే స్థితిలో లేనని అన్నారు. కొలీజియం కాకుండా ఎన్‌జేఏసీ అమలుపై కొత్త చట్టం తేవాలంటూ ఏఐడీఎంకే ఎంపీ కె.కామరాజ్, తెదేపా నేత పి.రవీంద్రబాబు, బీజేపీ నేత పి.చౌధురి డిమాండ్ చేశారు. ఎంపీలందరూ భారత ప్రజలకు జవాబుదారీ అని, న్యాయమూర్తులు మాత్రం ఎవరికీ కాదని విమర్శించారు. జవాబుదారీతనం లేని స్వతంత్ర ప్రతిపత్తి వల్ల న్యాయవ్యవస్థ మూలాలు దెబ్బతింటాయన్నారు. ❐

# పునాదిస్థాయిలోనే పగుళ్లు

-ఆచార్య నందిపాటి సుబ్బారావు

ఒక జాతికి గౌరవం, మంచి గుర్తింపు తెచ్చేది బాధ్యతాయుత పౌర సమాజమే. అలాంటి పౌర సమాజం రూపొందాలంటే తగిన విద్యావిధానం అవసరం. ఉత్తమ పౌరులను తయారుచేసి దేశానికి అందించగలిగేది నాణ్యమైన విద్యావ్యవస్థ మాత్రమే. విద్యావ్యవస్థ ఎంత పటిష్టంగా ఉంటే దేశం అంత త్వరితంగా ప్రగతి సాధించే అవకాశం ఉంటుంది. ప్రపంచం మొత్తం ఇప్పుడు భారత్ వైపు చూస్తోంది. ప్రపంచానికి నైపుణ్యాన్ని అందించటమే కాకుండా ప్రపంచ గమనాన్ని మార్చగల శక్తి భారత్‌కు ఉంది. ప్రపంచంలోనే అత్యధిక యువతను కలిగివున్న దేశం భారత్. యువత పెరిగినంత మాత్రాన అభివృద్ధి దానంతట అదే సాధ్యం కాదు. ప్రామాణిక విద్య అందుకు మార్గం. ప్రాథమిక విద్య నుంచే మౌలిక శాస్త్రాలకు పునాది పడాలి. అప్పుడే, విద్యార్థుల్లో విజ్ఞానం వికసించి, ఉన్నత విద్యలో సులువుగా రాణించే అవకాశం ఉంటుంది.

## ప్రమాణాల పతనం

దేశంలో విద్యాభివృద్ధికి కృషి జరుగుతున్నప్పటికీ- విద్యారంగ వార్షిక స్థాయి నివేదిక-2014 ఆందోళన కలిగించే వాస్తవాలనే వెల్లడించింది. ఆ నివేదిక ప్రకారం, దేశంలో అయిదో తరగతి విద్యార్థుల్లో 50శాతం, ఎనిమిదో తరగతి విద్యార్థుల్లో 25శాతం కనీసం రెండో తరగతి పాఠ్యపుస్తకాన్ని కూడా సరిగ్గా చదవలేకపోతున్నారు. శాస్త్ర సాంకేతిక రంగంలో కీలకపాత్ర పోషించే గణితంలోని మొదటి తొమ్మిది అంకెలను సైతం సరిగ్గా గుర్తించలేని స్థితిలో ఉన్న రెండో తరగతి విద్యార్థులు 2009లో 11.3శాతం. ఆ సంఖ్య 2014నాటికి 19.5శాతానికి పెరిగింది. భాగాహారం చేయగల ఎనిమిదో తరగతి విద్యార్థులు 2010లో 68.3శాతం. 2014నాటికి వారి సంఖ్య 44.1శాతానికి తగ్గింది. గణితమంటే భయపడిపోయే ధోరణి గత కొన్నేళ్లలో దేశవ్యాప్తంగా పెరిగింది.

మాతృభాషలో విద్యనభ్యసించటం ఎంత అవసరమో, ఆంగ్లభాషను నేర్చుకోవటమూ అంతే ముఖ్యం. అంతర్జాతీయ ప్రమాణాలకు దీటుగా ఎప్పటికప్పుడు శాస్త్రసాంకేతిక పరిజ్ఞాన మెళకువలను అలవరచుకోవడానికి, అర్థం చేసుకోవడానికి, తద్వారా శాస్త్ర పరిశోధనల్లో పురోభివృద్ధి సాధించటానికి ఆంగ్లభాషలో పట్టు ఉండాల్సిందే. కానీ విద్యారంగ వార్షికస్థాయి నివేదిక ప్రకారం, ఆంగ్లంలో ఉన్న సరళమైన వాక్యాన్ని ఏలాంటి తప్పులు లేకుండా సరిగ్గా చదివే అయిదో తరగతి విద్యార్థుల సంఖ్య 2009-14 మధ్య కాలంలో 25శాతమే! ఎనిమిదో తరగతి విద్యార్థుల్లో అలాంటివారు 2009లో 60శాతం. 2014 నాటికి అది 46.8శాతానికి పడిపోయింది. పైచదువుల్లో రాణించాలంటే విద్యార్థులకు సరైన పునాది పడేది, పడాల్సిందీ ప్రాథమిక విద్యలోనే. ఈ దశలో విద్యార్థులకు అటు



భాష మీద, ఇటు సైన్సు మీద ఇష్టాన్ని కలిగించేలా, వారిలోని సృజనాత్మకతను వెలికితీసే విధంగా దేశీయ విద్యావిధానంల లేదనే నిజాన్ని ఈ నివేదిక తేటతెల్లం చేసింది.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పాఠశాలల్లో మౌలిక వసతులు, విద్యార్థుల హాజరు పెంచడానికి, మధ్యాహ్న భోజన పథకానికీ వేలకోట్లు వెచ్చిస్తున్నాయి. కానీ ఆశించిన ఫలితాలు రావటం లేదు. పాఠశాలల్లో విద్యార్థులు-ఉపాధ్యాయుల నిష్పత్తి 2010లో 38.9శాతం. అది 2014 నాటికి 45.3శాతానికి పెరిగింది. ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల హాజరు బాగా పెరిగినప్పటికీ, వారి విద్యాస్థాయి మెరుగుపడలేదు. మౌలిక విద్యలో పటిష్ఠమైన బోధన కరవు కావడం వల్లే, ప్రాథమిక విద్య నానాటికీ దిగజారుతోంది. ఈ ధోరణి విద్యావ్యవస్థ మనుగడకు, దేశీయ శాస్త్రసాంకేతికాభివృద్ధికీ విఘాతకరమైనది.

పేద విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలలే దిక్కు. ప్రాథమిక విద్య ప్రభావం ఉన్నత విద్య మీద, శాస్త్రీయ పరిశోధన మీద

పడుతుంది. అందుకే దీని పటిష్ఠానికి ప్రత్యేక చర్యలు అవసరం. భారత విద్యార్థుల్లో చాలామంది ఉన్నత విద్యాభ్యాసానికి అమెరికాకు వెళ్లడానికే మొగ్గు చూపుతున్నారు. అక్కడి విశ్వవిద్యాలయాలలో ఆధునిక వసతులు ఉండటం, పాఠ్యాంశాల బోధనకన్నా నాలుగు రెట్లు అధిక సమయం ప్రాక్టికల్స్‌కి కేటాయించటం, విశ్వవిద్యాలయాలు పారిశ్రామిక రంగానికి మార్గదర్శకాలుగా, పరిశ్రమలకు అనుసంధానంగా ఉండటమే అందుకు ప్రధాన కారణాలు. అమెరికా గ్రాడ్యుయేట్ విద్యాలయాల మండలి గణాంకాల ప్రకారం, 2013-14లో భారత్ నుంచి అక్కడికి వెళ్లిన విద్యార్థుల సంఖ్య 2013-14లో 25శాతం. ఇతర దేశాల నుంచి అమెరికాకు వెళ్లిన విద్యార్థుల సంఖ్య కేవలం తొమ్మిది శాతం. భారత్ నుంచి అమెరికాకు వెళుతున్న విద్యార్థుల్లో 80శాతం అక్కడే పీహెచ్‌డీలు చేసి ఉండిపోతున్నారు. విద్యార్థులు ఇలా వలస వెళ్లటం దేశానికి ఆర్థికంగా, విద్యాపరంగా తీరని నష్టం కలిగిస్తోంది. దీని ప్రభావం ఖచ్చితంగా భారత పరిశోధనలపైనా ఉంటుంది.

## మూస విధానానికి చెల్లుచీటి

ఉత్తమ విద్యావిధానం కలిగి ఉండి, విద్య మీద అధికంగా పెట్టుబడులు పెడుతున్న దేశాలే త్వరితంగా అభివృద్ధి చెందుతున్నాయి. శాస్త్ర పరిశోధన-అభివృద్ధి రంగాలలో భారత్ చాలా వెనకబడి ఉండటానికి కారణం- స్థూల దేశీయ ఉత్పత్తిలో వీటి మీద అతి తక్కువగా 0.96శాతం వ్యయం చేయడమే. శాస్త్ర పరిశోధన రంగంలో దక్షిణ కొరియా 4.36శాతం, జపాన్ 3.67శాతం, అమెరికా 2.70శాతం, చైనా 1.97శాతం, బ్రిటన్ 1.70శాతం ఖర్చు చేస్తున్నాయి. భారత్ ప్రస్తుత వ్యయాన్ని కనీసం రెండు శాతానికి పెంచవలసిన అవసరం ఎంతైనా ఉంది. భారత్‌లో చక్కని అర్హతలు, సామర్థ్యం ఉన్న విద్యావేత్తలు, పరిశోధకులు ప్రాథమిక స్థాయి నుంచి ఉన్నత విద్యారంగం వరకు పద్ధతి ప్రకారమే ఎంపిక అవుతున్నారు. కానీ, ఉద్యోగంలో స్థిరపడి, భరోసా ఏర్పడ్డాక పరిసరాల ప్రభావంతో వారి వ్యవహారశైలిలో మార్పులు చోటు చేసుకుంటున్నాయి. కొంతమంది రాజకీయ ముసుగులో, కొంతమంది వ్యక్తిగత వ్యాపార వ్యవహారాల్లో మునిగితేలుతున్నారు. ఎక్కువమంది ఉద్యోగ భద్రత మీద చూపిస్తున్నంత శ్రద్ధ బోధన, పరిశోధన మీద చూపడం లేదనేది వాస్తవం. ఈ విషయంలో ప్రభుత్వాలు అసహనం వ్యక్తం చేయడం తప్ప, ఎలాంటి చర్యలు చేపట్టకపోవటం ఆశ్చర్యం కలిగిస్తోంది. వీరి ద్వారా విద్యాప్రమాణాలు పెరుగుతాయని అనుకోవడం అత్యాశే. దేశంలో విద్య, పరిశోధన రంగాలలో ఆశించిన స్థాయిలో ఫలితాలు రాకపోవడానికి కారణమిదే. ప్రాథమిక విద్య నుంచి ఉన్నతస్థాయి వరకు తగినన్ని నిధులు సకాలంలో అందే విధంగా ప్రభుత్వాలు ఇకనైనా చర్యలు తీసుకోవాలి. ప్రాక్టికల్ తరగతులకు అధిక ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా విద్యార్థుల్లో ఇమిడి ఉన్న విజ్ఞానాన్ని వెలికితీయడానికి ప్రయత్నించాలి. విశ్వవిద్యాలయాలు పరిశోధన కేంద్రాలుగా పరిఢవిల్లాలంటే, పరిశోధకులకు సత్వరం, అవసరమైనన్ని నిధులు సమకూర్చేందుకు సరళీకృత విధానాన్ని రూపొందించాలి. నిధుల ఖర్చు విషయంలో పరిశోధకులకు స్వేచ్ఛనివ్వాలి. ఉపాధ్యాయులకు ఎక్కువగా బోధనేతర బాధ్యతలు అప్పగించటం మంచిది కాదు. విద్యార్థుల సామర్థ్యానికి సానపట్టే విధంగా విద్యావిధానం ఉన్నప్పుడే, వారిలో సృజనాత్మకత పెరిగి సొంత కాళ్ల మీద నిలబడగలుగుతారు. ఆ మేరకు ప్రభుత్వాలు విద్యావిధానంలో సమూల మార్పులు తీసుకురావలసిన అవసరం ఉంది.


## విద్యావిధానం ముసాయిదా తీరు ఇలాగా?

ప్రపంచంలోనే అత్యధికంగా దాదాపు 36 కోట్ల యువ జనాభా కలిగిన దేశం భారత్. దేశ జనాభాలో అది 28 శాతం. మరే దేశంలోనూ లేనంత పెద్దసంఖ్యలో 28.7 కోట్ల మేరకు నిరక్షరాస్యులూ ఇక్కడే పోగుపడి ఉన్నారు. ప్రపంచంలోని మొత్తం నిరక్షరాస్యుల్లో 37శాతానికి ఇది సమానం. మరోవైపు దేశంలో నిరుద్యోగిత రేటూ చాలా ఎక్కువగా ఉంది. 2011 జనాభా లెక్కల ప్రకారం ఉన్నత విద్య అభ్యసించి ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న భారతీయుల సంఖ్య 15శాతం. కొత్త విద్యావిధానాన్ని ఆవిష్కరించేందుకు కసరత్తు ప్రారంభించిన కేంద్రప్రభుత్వం, ఈ అంశాన్ని విస్మరించజాలదు. రానున్న దశాబ్దాల్లో భారత ఆర్థిక, సామాజిక, రాజకీయ భవితవ్యాన్ని తీర్చిదిద్దేదిగా ఈ విద్యావిధానం రూపుదిద్దుకోవాల్సిన అవసరం ఉంది. కానీ, దీనికి సంబంధించిన ముసాయిదా రూపొందించేందుకు సర్కారు నియమించిన అయిదుగురు సభ్యుల బృందంలో ఎన్‌సీఈఆర్‌టీ మాజీ డైరెక్టర్ జేఎస్ రాజపుత్‌ని మినహాయిస్తే, మిగతావారంతా మాజీ బ్యూరోక్రాట్లే కావటం ఆశ్చర్యం కలిగిస్తుంది. సమాజంలో విద్యార్థుల సంబంధబాంధవ్యాలను పటిష్ఠపరిచి, వారిలో వైజ్ఞానిక ఆలోచలను ఉద్దీపింపచేసేదిగా కొత్త విద్యావిధానం ఉండాలన్న రాష్ట్రపతి తదితరుల ఆకాంక్షలు ఏమేరకు నెరవేరుతాయన్నది ఇలాంటప్పుడు ప్రశ్నార్థకమే! ❐

(ఈనాడు సౌజన్యంతో)

# 'దోపిడీ' నైపుణ్యాల అభివృద్ధి విధానం

**- భరత్ ఝున్‌ఝున్‌వాలా**




మన ఆర్థిక వ్యవస్థ పురోగతికి అవసరమైన నైపుణ్య సిబ్బంది కొరత ఎంతైనా ఉందన్నది ఒక వాస్తవం. సర్టిఫికెట్లు చేత పట్టుకుని డజన్ల మంది ఉద్యోగానికి ఇంటర్వ్యూకి వస్తారని, అయితే మాకు అవసరమైన నైపుణ్యాల ఉన్న అభ్యర్థి వారిలో ఒక్కరు కూడా ఉండరని బెంగళూరుకి చెందిన ఒక మహిళా వ్యాపారవేత్త చెప్పారు. కంప్యూటర్ అప్లికేషన్స్‌లో సర్టిఫికెట్ ఉండి, వర్డ్ ఫైల్ ఎలా ఓపెన్ చేయాలో, ఒక ఫైల్‌ను ఎలా ప్రింట్ చేయాలో తెలియని ఉద్యోగార్థుల సంఖ్య తక్కువేమీ కాదు.

శిక్షణలో సమకూరుస్తున్న నైపుణ్యాలకు, ఫ్యాక్టరీ లేదా ఆఫీసులో అవసరమైన నైపుణ్యాలకు పొంతన లేకుండా ఉందని ఈ అంశంపై అందుబాటులో ఉన్న సమాచారం స్పష్టం చేస్తుంది. అసలైన నైపుణ్యాలు ఉన్నవారు కొద్దిమందికాగా, నైపుణ్యాలు ఉన్నట్టు సర్టిఫికెట్లు గలవారు అత్యధిక సంఖ్యలో ఉన్నారనేది ఒక వాస్తవం. ఇది మన ఆర్థిక వ్యవస్థ ఎదుర్కొంటున్న మౌలిక సమస్యల్లో ఒకటి. అనర్హ సర్టిఫికెట్లు ఉన్నవారు పెద్దసంఖ్యలో ఉండటమనే సమస్య ప్రతి రంగంలోనూ ఉన్నది.

ఇరవై మంత్రిత్వ శాఖల ఆధ్వర్యంలోని 73 విభాగాలు నైపుణ్యాల అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహిస్తున్నాయి. ఈ కార్యక్రమాలన్నిటినీ నైపుణ్యాల అభివృద్ధి మంత్రిత్వ శాఖ సమన్వయం చేస్తోంది. ప్రయోజనకర ఫలితాలను సాధించటానికి ఇదేమీ ఉపయోగపడదు. నిజం చెప్పాలంటే, ఈ సమన్వయం అనేది 73 మంది దొంగల కార్యకలాపాలను సమన్వయం చేయడమే సుమా! చెప్పవచ్చినదేమంటే, శిక్షణ ఇచ్చేవారు ధన సంపాదనే ఏకైక లక్ష్యంగా శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు మరి.

ఒక గంటపాటు శిక్షణ ఇచ్చినందుకు విద్యార్థికి రూ. 12.50 చొప్పున తమకు చెల్లిస్తారని ఒక ఎన్‌జీవో ప్రతినిధి నాకు చెప్పారు. యాభై మంది విద్యార్థులు గల ఒక బ్యాచ్‌కి రోజుకు 6 గంటల చొప్పున ఇరవై రోజులు శిక్షణనిచ్చినందుకుగాను ప్రభుత్వం నుంచి అతనికి

రూ.75,000 ఆదాయం లభిస్తుంది. ఇటువంటి శిక్షణా కార్యక్రమాలను 'సమన్వయం' చేయటం నైపుణ్యాల అభివృద్ధికి ఏమాత్రం తోడ్పడదని మరి చెప్పనవసరం లేదు. సంబంధిత మంత్రిత్వ శాఖ అధికారులు తమ లంచాలను వసూలు చేసుకునేందుకు మాత్రమే తోడ్పడుతుంది. ఇదిలా ఉంటే మరిన్నిమందికి శిక్షణ ఇవ్వడానికిగాను పరిశ్రమల వారికి ప్రోత్సాహకాలు ఇవ్వాలని పలువురు సూచిస్తున్నారు. దీనివల్ల కూడా పెద్దగా ప్రయోజనముండదు. ఒక పారిశ్రామికవేత్త పని.. సరకులను ఉత్పత్తి చేసి వాటిని విక్రయించడమే. తన పరిమిత వనరులను ఇతర కార్యకలాపాలకు ఏ పారిశ్రామికవేత్తా వినియోగించలేడు.

పూణేలో అవసరమైన నైపుణ్యాలను సమకూర్చే సంస్థ ఒకటుంది. ఆ సంస్థ ఏ విద్యార్థికీ సర్టిఫికెట్‌గానీ, డిగ్రీ గానీ ఇవ్వదు. అయితే ఆ విద్యార్థులు తమ శిక్షణా కాలంలో సగం కాలాన్ని వివిధ పరిశ్రమల్లో గడిపే ఏర్పాట్లు చేస్తుంది. దీనివల్ల సంబంధిత కంపెనీలకు కార్మికులు చాలా చౌకగా లభ్యమవుతున్నారు. విద్యార్థులకూ అవసరమైన నైపుణ్యాలు సమకూరుతున్నాయి. కోర్సు పూర్తి చేసిన వెంటనే 90శాతం మంది విద్యార్థులకు ఉద్యోగాలు లభిస్తున్నాయి. నైపుణ్యాలను అభ్యసించే విద్యార్థులకు కొదవలేదని, అలాగే వారికి శిక్షణనివ్వడానికి సంసిద్ధంగా ఉన్న కంపెనీలకూ కొదవలేదనే విషయం దీన్ని బట్టి స్పష్టమవుతుంది. ఇటువంటి పరస్పర ప్రయోజనకర కార్యకలాపాలను ప్రోత్సహించే ప్రభుత్వ కార్యక్రమమేదీ లేదు.

ఇంతవరకూ బాగా లబ్ధి పొందుతున్నది అనర్హ సర్టిఫికెట్లదారులను తయారుచేసే సంస్థలే. వాస్తవానికి నిజమైన శిక్షణనిచ్చే సంస్థల వల్ల తమ ప్రయోజనాలకు ముప్పు వాటిల్లుతుందని ఈ సంస్థలవారు భయపడుతున్నారు. కనుకనే ఈ నిజమైన శిక్షణా సంస్థలు బూటకమైనవని ఆరోపిస్తున్నారు. వాటిని మూసివేయిస్తున్నారు. మరి మార్గాంతరమేమిటి? సదరు సర్టిఫికెట్ సంస్థలను రూపుమాపటమే. ఇందుకు ప్రభుత్వోద్యోగుల జీతాలను సగానికి కోత పెట్టవలసిన అవసరమున్నది. దీనివల్ల ప్రభుత్వోద్యోగాల పట్ల ఆరాటం తగ్గిపోతుంది. అప్పుడు నకిలీ సర్టిఫికెట్లు సంపాదించుకోవటానికి ఎవరూ ఆరాటపడరు.

ఈ శిక్షణా కార్యక్రమాలలో బాహ్య తనిఖీ పద్ధతిని ప్రవేశపెట్టాలి. నైపుణ్యాల అభివృద్ధి నిధులను శిక్షణా కార్యక్రమాలకుగాక సంబంధిత అభ్యర్థులు ఏమేరకు నైపుణ్యాల అభివృద్ధిని సముపార్జించుకున్నారనే దాన్నిబట్టి చెల్లించాలి. ప్రస్తుతం ఒక శిక్షణా కోర్సులో చేరినందుకే ఈ చెల్లింపులు చేస్తున్నారు. సదరు కోర్సు శిక్షణార్థులు నిర్దిష్ట నైపుణ్యాలను సమకూర్చుకునేందుకు, ఉద్యోగాలు పొందేందుకు లేదా స్వంత వ్యాపార సంస్థలను ప్రారంభించేందుకు దోహదం చేస్తుందా అనే దానితో నిమిత్తం లేకుండా ఈ చెల్లింపులు జరుగుతున్నాయి. నైపుణ్యాల అభివృద్ధి కార్యక్రమాల చెల్లింపులను విభజించాలి. 25శాతం సొమ్మును శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించినప్పుడు చెల్లించవచ్చు. మిగతా సొమ్ము ఎంతమంది శిక్షణార్థులు ఉద్యోగాలను పొందారు అనే దాన్ని బట్టి చెల్లించాలి.

**అభివృద్ధి చెందిన దేశాల్లో వృత్తి విద్యాకోర్సుల్లో క్షేత్ర శిక్షణ ఇవ్వడానికి కేటాయిస్తున్న సమయం 60శాతానికి పైగా ఉండగా, మనదేశంలో అది కేవలం రెండు శాతం మాత్రమే. శిక్షణా సమయంలో విద్యార్థులను కార్ఖానాలకు పంపితే మంచి నైపుణ్యాలను సమకూర్చుకుంటారు. పాఠశాల విద్యావ్యవస్థలోనూ వృత్తివిద్య శిక్షణా కార్యక్రమాలకి ప్రాధాన్యత ఇవ్వాలి.**

ఐటీఐ, పాలిటెక్నిక్ విద్యా బోధనను పూర్తిగా పునర్వ్యవస్థీకరించాలి. ఆచరణలో పనికొచ్చేలా వాటిని రూపొందించాలి. ఐటీఐ, పాలిటెక్నిక్ విద్యావిభాగంలో పనిచేస్తున్న బోధకుల్లో అత్యధికులు సర్టిఫికెట్ సంస్థల్లో రూపొందినవారే. వారికి నైపుణ్యాలు ఉన్నాయని చెప్పలేం. ఉన్నా అవి చాలా పరిమితమైనవి మాత్రమే. వారికి మరోసారి శిక్షణ ఇవ్వాల్సిన అవసరముంది. పొందిన శిక్షణను కఠిన పద్ధతుల్లో పరీక్షించి ధ్రువీకరించాలి.

అభివృద్ధి చెందిన దేశాల్లో వృత్తి విద్యాకోర్సుల్లో క్షేత్ర శిక్షణ ఇవ్వడానికి కేటాయిస్తున్న సమయం 60శాతానికి పైగా ఉండగా, మనదేశంలో అది కేవలం రెండు శాతం మాత్రమే. శిక్షణా సమయంలో విద్యార్థులను కార్ఖానాలకు పంపితే మంచి నైపుణ్యాలను సమకూర్చుకుంటారు. పాఠశాల విద్యావ్యవస్థలోనూ వృత్తివిద్య శిక్షణా కార్యక్రమాలకి ప్రాధాన్యత ఇవ్వాలి. తద్వారా ప్రతి బాలికా, బాలుడూ నిర్దిష్ట వృత్తి కౌశలాలను అలవర్చుకోగలుగుతారు. ❐

('ఆంధ్రజ్యోతి' సౌజన్యంతో)

# నివారించదగ్గ బాధల్ని తొలగించటంలో ఎందరికో స్ఫూర్తి జుకర్‌బర్గ్ ఔదార్యం: జేపీ



**తమ కూతురునుద్దేశించి రాస్తూ, "నేటి ప్రపంచంకన్నా ఎంతో మెరుగైన ప్రపంచంలో నీవు పెరగాలని, సంపూర్ణ ఆయురారోగ్యాలతో ఆ అవకాశాలను అందిపుచ్చుకోవాలని అందరు తల్లిదండ్రుల్లా మేమూ ఆశిస్తున్నాం, ఆశీర్వదిస్తున్నాం. ఈ నమ్మకాన్ని రుజువు చేయటానికి మా వంతు కృషి మేం చేస్తాం. నీ మీద మాకున్న ప్రేమ, తర్వాతి తరం పిల్లల పట్ల మాకున్న బాధ్యత ఈ కృషికి మాకు ప్రేరణనిస్తున్నాయి.**

ఫేస్‌బుక్ కంపెనీలోని తన వ్యక్తిగత షేర్లలో 99శాతాన్ని ప్రజాప్రయోజనాల కోసం ఇచ్చేస్తానని ఆ సంస్థ వ్యవస్థాపకుడు మార్క్ జుకర్‌బర్గ్ ప్రకటించటం గొప్ప ఉదాత్త స్పందన అని లోక్‌సత్తా పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. బిల్ గేట్స్, వారెన్ బఫెట్, ఇప్పుడు జుకర్‌బర్గ్ అనేకమందికి స్ఫూర్తినిస్తున్నారన్నారు. ఇటువంటి వదాన్యత, సాంకేతికత, మానవీయతతో 21వ శతాబ్దం నివారించదగ్గ బాధల్ని తొలగించి వివక్ష లేకుండా ప్రతి బిడ్డకూ సామర్థ్యం మేర ఎదిగే అవకాశాల్ని అందించగలుగుతుందని అన్నారు. "ఇటువంటి క్షణాలు మనలో ఆశావహ దృక్పథాన్ని పెంచుతాయి. మనుషులుగా గర్వించేలా చేస్తాయి. హ్యాట్సాఫ్ టు మార్క్ జుకర్‌బర్గ్. మనిషి ఉదాత్త జంతువు" అని జయప్రకాష్ నారాయణ్ అన్నారు.

### భావితరాల కోసం 3 లక్షల కోట్లు

తాము, తమ బిడ్డలు బాగుండాలంటే చుట్టూ ఉన్న సమాజం కూడా బాగుండాలని కాస్త లోకజ్ఞానమున్న ఎవరికైనా తెలుస్తుంది. ఈ తెలిసిన విషయాన్ని ఆచరించే శక్తిగలవారు ఎంత ఎక్కువమంది ఉంటే ఆ సమాజం అంత బాగుంటుంది.

తన సుఖాన్ని, సమాజ హితాన్ని సంధానం చేసే క్రమంలో ఓ వ్యక్తి లక్షల కోట్లు విరాళమిస్తే.. మంచి రాజకీయం చేసినంత స్థాయిలో కాకపోయినా, కొన్ని వ్యక్తిగత ప్రయోజనాలు ఇమిడివున్నా కూడా అది ప్రపంచాన్నంతా ప్రభావితం చేసే ఓ గొప్ప సానుకూల పరిణామమవుతుంది. ఇటీవలే పుట్టిన తన కుమార్తె మ్యాక్స్ పెరిగే ప్రపంచం అందంగా ఉండాలనే ఆకాంక్షతో జుకర్‌బర్గ్, ప్రిసిలా చాన్ దంపతులు సుమారు 3లక్షల కోట్ల విలువైన తమ షేర్లను ప్రపంచానికి ధారపోశారు. రేపటితరం కోసం ఇది తమ నైతిక బాధ్యత అని పేర్కొన్నారు. అంతర్జాల సామాజిక మాధ్యమ వేదిక ఫేస్‌బుక్ సీఈవో జుకర్‌బర్గ్ తనకు పాప జన్మించిన ఆనందఘట్టాన్ని ఇంత మహోఘనంగా చాటుకున్నారు. ఈ మేరకు ఫేస్‌బుక్‌లో ఒక లేఖను పోస్ట్ చేశారు. "మా కుమార్తె మ్యాక్స్‌ని ఈ ప్రపంచంలోకి స్వాగతించటం ఎంతో సంతోషంగా ఉంది. వ్యాధులకు చికిత్స, కేంద్రిత అభ్యసనం, హరిత విద్యుత్తు, ప్రజల అనుసంధానత, బలమైన సామాజిక బృందాల నిర్మాణం, పేదరికం తగ్గించటం, సమాన హక్కులు కల్పించటం, దేశాల మధ్య అవగాహన వ్యాప్తి ద్వారా మానవ సామర్థ్యాన్ని మరింత ముందుకు తీసుకెళ్లి సమానత్వాన్ని ప్రోత్సహించే సమాజం కోసం పనిచేయాలని, అలాంటి సమాజంలో మా పాప ఎదగాలని ఆశిస్తున్నాం" అని రాశారు. ''ఈ ప్రపంచాన్ని చిన్నారులందరి కోసం తీర్చిదిద్దేందుకు మా వంతుగా చిన్న సాయం చేసేందుకు కట్టుబడి ఉన్నాం. రేపటితరం కోసం ఈ ప్రపంచాన్ని మెరుగుపరచటంలో ఇతరులతో చేతులు కలిపేందుకు ఫేస్‌బుక్‌లోని 99శాతం షేర్లను జీవితకాలంలో అందచేస్తాం" అని తెలిపారు.

తమ కూతురునుద్దేశించి రాస్తూ, "నేటి ప్రపంచంకన్నా ఎంతో మెరుగైన ప్రపంచంలో నీవు పెరగాలని, సంపూర్ణ ఆయురారోగ్యాలతో ఆ అవకాశాలను అందిపుచ్చుకోవాలని అందరు తల్లిదండ్రుల్లా మేమూ ఆశిస్తున్నాం, ఆశీర్వదిస్తున్నాం. ఈ నమ్మకాన్ని రుజువు చేయటానికి మా వంతు కృషి మేం చేస్తాం. నీ మీద మాకున్న ప్రేమ, తర్వాతి తరం పిల్లల పట్ల మాకున్న బాధ్యత ఈ కృషికి మాకు ప్రేరణనిస్తున్నాయి. మీ తరానికి ఎదురయ్యే సమస్యలను తీర్చటానికి, గొప్ప అవకాశాలను అందిపుచ్చుకునే సామర్థ్యాన్ని సమకూర్చటానికి సామాజిక వనరులను కేంద్రీకరించాల్సి ఉంది. ఉదాహరణకి, జనం అసలు రోగాల బారిన పడకుండా నివారించాల్సుంది. ఇప్పుడు వ్యాధి నివారణ కన్నా వ్యాధి చికిత్సకు చేస్తున్న ఖర్చు 50 రెట్లు ఎక్కువగా ఉంది. మానవ శక్తిసామర్థ్యాలు ఎంతగా విస్తరిస్తే మన జీవితాలు అంత సుసంపన్నమవుతాయి. సమానత్వాన్ని అందిస్తే సమాజం గొప్పగా పురోగమిస్తుంది.

ఇదేదో న్యాయం, దానధర్మాలకు సంబంధించిన విషయం కాదు. ప్రపంచంలో ప్రతి ఒక్కరి ప్రతిభ, కృషి, ఆలోచనల్ని సమస్త మానవాళి దిశగా పనిచేసినప్పుడే గొప్ప పురోగమనం సాధ్యమవుతుంది. మానవ శక్తి సామర్థ్యాలను, సమానత్వాన్ని పెంపొందించటానికి మనం తక్షణ, దీర్ఘకాలిక దృక్పథాలతో పనిచేయాలి. స్వతంత్ర బలీయమైన నాయకత్వాన్ని ప్రోత్సహించాలి. మా తరం వారికి వేర్వేరు లక్ష్యాలు, ఆసక్తులు ఉన్నా మేమంతా ఒకే తరగతి గదిలో, ఒకే రీతిలో నేర్చుకున్నాం. మీ తరం ఇందుకు పూర్తి భిన్నంగా తన లక్ష్యాలను తానే నిర్ణయించుకోబోతోంది. ఇంజినీరు, ఆరోగ్య సంరక్షకుడు, రచయిత, సామాజిక నేత- ఇలా మీకు నచ్చిన వృత్తిని ఎంచుకుని ఎదిగే అవకాశం ఉంది. ఈ విషయంలో మీకు వెంటనే తోడ్పాటునిచ్చే సాంకేతిక పరిజ్ఞానం ఉంది.

కానీ టెక్నాలజీ ఒక్కటే సమస్యల్ని పరిష్కరించలేదు. ఆరోగ్యవంతమైన, బలమైన సామాజిక బృందాలు మెరుగైన ప్రపంచసృష్టికి మొదటి మెట్టు అవుతాయి. పిల్లలు మానసిక వత్తిడి లేకుండా పౌష్టికాహారంతో పెరగాలి. పాఠశాలలు, వైద్యకేంద్రాలు, తల్లిదండ్రుల బృందాలు, స్థానిక ప్రభుత్వాల భాగస్వామ్యంతో పిల్లలందరికీ పౌష్టికాహారం, ఆలనాపాలనా, సమగ్ర బోధనావసతుల్ని అందించినట్టయితే అందరికీ సమానావకాశాలు లభిస్తాయి. ఇందుకోసం నేడు అమ్మ, నేను మా జీవితాల్ని అంకితం చేస్తున్నాం. ఈ సవాళ్ల పరిష్కారానికి ఇప్పటి నుంచే మేం కృషిని ప్రారంభించాలి. నీవు పెద్దయ్యే వరకూ ఆగే ప్రసక్తే లేదు. చిన్న వయసులోనే కృషిని ప్రారంభిస్తే మనం జీవితపర్యంతం లబ్ధి పొందుతూనే ఉంటాం. మొదట వ్యక్తి కేంద్రిత అభ్యసనం, వ్యాధుల చికిత్స, ప్రజల అనుసంధానం, బలిష్ట సామాజిక బృందాల నిర్మాణం మీద దృష్టి పెడతాం" అని జుకర్‌బర్గ్ దంపతులు అన్నారు. ❐

# 'పెద్దల' పాత్ర పరిమితమైతేనే ప్రజాభిప్రాయానికి విలువ!

**- డా॥ జయప్రకాష్ నారాయణ్**

**12 సంవత్సరాలుగా ప్రజల నోళ్లలో నానుతున్న బోఫోర్స్ కుంభకోణం ఓ కొలిక్కి వచ్చి ఇటీవలే ఛార్జిషీటు దాఖలైంది. అందులో రాజీవ్ గాంధీ పేరు చేర్చరాదని కాంగ్రెస్ వాదన. చట్టప్రకారం కుంభకోణంతో ప్రమేయమున్న వ్యక్తులందరి పేర్లు చేర్చాలని, మరణించిన కారణంగా రాజీవ్ గాంధీ మీద సహజంగానే కేసు ఉండదని ప్రభుత్వ వాదన. కేవలం తన భర్త పేరును ఛార్జిషీటులో చేర్చారన్న కారణంగా భారత పార్లమెంటును స్తంభింప చేయటానికి కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియా గాంధీ పూనుకున్నారు. బట్టతలకు మోకాలికీ లంకె పెట్టి, తన పార్టీ ప్రతిపాదించిన అంశాలతో సహా ఏ చట్టాన్నీ రాజ్యసభలో ఆమోదం కాకుండా అడ్డుకుంటామని ప్రకటించారు! కొద్దివారాల క్రితమే ఎన్నికయిన ప్రభుత్వం అచేతనంగా చూస్తుండటమే తప్ప చేసేదేమీ లేదు! ఇదీ మన పార్లమెంటరీ ప్రజాస్వామ్యం దుస్థితి!**

గత కొద్ది సంవత్సరాలుగా పరిణామాలను గమనించినవారికి మనదేశంలో కేంద్రప్రభుత్వంలో ఏ చట్టమయినా చేయటం ఎంత కష్టమో విశదమవుతుంది. రాజ్యాంగం ప్రకారం ఒక బిల్లు చట్టం కావాలంటే, పార్లమెంటు ఉభయ సభలూ ఆ బిల్లును ఆమోదించాలి. ఆ తరువాత రాష్ట్రపతి దాన్ని ఆమోదించాక చట్టమవుతుంది. పార్లమెంటులో దిగువసభ అయిన లోక్‌సభ ప్రజలు ప్రత్యక్షంగా ఐదేళ్లకొకసారి, లేదా అంతకంటే తరచుగా వచ్చే మధ్యంతర ఎన్నికలలో ఎన్నుకునే సభ. అంటే సిద్ధాంత ప్రకారం, ఆచరణ రీత్యా కూడా ఆనాటి ప్రజాభిప్రాయాన్ని, జనం మద్దతును కూడగట్టుకుని పౌరులకు ప్రాతినిధ్యం వహించేది లోక్‌సభ. అసలు 'దిగువసభ' అనే వాడుక పేరును మనం బ్రిటన్ నుంచి దిగుమతి చేసుకున్నాం. ఆ దేశంలో నిరంకుశ రాచరికం నుంచి కాలక్రమేణా ప్రజాస్వామ్యం వచ్చింది. రాజు ఎంపిక చేసి నామినేట్ చేసిన 'ప్రభువు'లందరూ ఎగువసభ అయిన హౌస్ ఆఫ్ లార్డ్స్‌లో కూర్చుంటారు. 'పెద్దల'తో, 'ప్రభువు'లతో కూడిన సభ కాబట్టి అది ఎగువసభ అయింది. అలాకాక 'సామాన్య' ప్రజలు ఎన్నుకున్న, ప్రజల నుంచి వచ్చిన సభ కాబట్టి 'హౌస్ ఆఫ్ కామన్స్' అయింది. 'కింది' వాళ్ల నుంచి వచ్చిన సభ కాబట్టి 'దిగువసభ' అని పిలవటం పరిపాటిగా మారింది.



## అనాలోచిత దిగుమతి

మన రాజ్యాంగాన్ని రచించినప్పుడు బ్రిటీషు సాంప్రదాయాల్ని, పోకడల్ని అనాలోచితంగా, యధాతథంగా దిగుమతి చేసుకున్నాం. అందుకే మనం కూడా పార్లమెంటులో రెండు సభలను ఏర్పాటు చేసుకున్నాం. ప్రజలెన్నుకునే లోక్‌సభను దిగువసభగాను, రాష్ట్ర శాసనసభ్యులెన్నుకునే రాజ్యసభను 'ఎగువసభ'గానూ వ్యవహరించటం మొదలుపెట్టాం. మళ్లీ ఎగువసభ విషయంలో అమెరికా సాంప్రదాయాలు కొన్నింటిని పాటించాం. అమెరికాలో ఎగువసభ అయిన సెనేట్ సభ్యులకు ఆరేళ్ల పదవీకాలం ఉంది. ప్రతి రెండేళ్లకు మూడోవంతు సభ్యులు పదవీవిరమణ చేస్తారు. అలా ఖాళీ అయ్యే స్థానాలను ప్రత్యక్ష ఎన్నిక ద్వారా



భర్తీ చేస్తారు. ప్రతి రాష్ట్రానికీ– ఆ రాష్ట్రాల జనాభాతో నిమిత్తం లేకుండా– ఇద్దరు సెనేటర్లు ఉంటారు. అమెరికా రాష్ట్రాల కలయిక వల్ల ఏర్పడిన దేశం కాబట్టి, అది పూర్తిగా ఫెడరల్ రాజ్యాంగ వ్యవస్థ కాబట్టి అన్ని రాష్ట్రాలకూ ఎగువసభలో సమాన ప్రాతినిధ్యం కల్పించుకున్నారు. ఒకప్పుడు రాష్ట్రాల శాసనసభల నుంచి ఎన్నికయిన సెనేటర్లను, ఆ తరువాత సంస్కరణలు చేపట్టి ప్రత్యక్షంగా ప్రజల నుంచి ఎన్నుకోవటం మొదలుపెట్టారు. అమెరికన్ సెనేట్‌కు ఆ దేశ ఉపరాష్ట్రపతి అధ్యక్షుడుగా వ్యవహరిస్తారు. మన రాజ్యసభలో కూడా ప్రతి రెండేళ్లకు మూడోవంతు సభ్యులు పదవీ విరమణ చేస్తారు. అలా ఖాళీ అయ్యే స్థానాలను భర్తీ చేయటానికి రాష్ట్రాల శాసనసభల సభ్యులు ఎన్నుకుంటారు. అలా ఎన్నికైన వాళ్ల పదవీకాలం ఆరేళ్లు. మన రాజ్యసభకు కూడా ఉపరాష్ట్రపతే అధ్యక్షుడిగా వ్యవహరిస్తారు. తేడాలు ఏమంటే, అమెరికాలో సెనేట్‌లాగా మన రాజ్యసభ ప్రజలు ప్రత్యక్షంగా ఎన్నుకున్న సభ కాదు. అలాగే ఈ దేశంలోలాగా అన్ని రాష్ట్రాలకూ సమాన ప్రాతినిధ్యంకాక, మనదేశంలో రాష్ట్రాల జనాభా రీత్యా రాజ్యసభ స్థానాలను పెంచారు. ఆ విధంగా ఆంధ్రప్రదేశ్‌కు రాజ్యసభలో 18 స్థానాలు ఉన్నాయి. అదే ఉత్తరప్రదేశ్‌కి 34 స్థానాలున్నాయి. కర్ణాటకకు 12 స్థానాలున్నాయి. ఉభయ సభల ఏర్పాటు ఎలా ఉన్నా, వాటి అధికారాల విషయంలో చిక్కులు వచ్చిపడ్డాయి. రాజ్యాంగ నిర్మాతలు అమెరికాననుసరించి, మన దేశంలో ఆర్థిక బిల్లులు మినహా మిగతా చట్టాలు చేసే విషయంలో ఉభయ సభలకూ సమాన అధికారాలను నిర్దేశించారు. చట్టం ముసాయిదాను 'బిల్లు'గా వ్యవహరిస్తారు. ఒక బిల్లు విషయంలో ఉభయసభలలో ఏది వ్యతిరేకించినా మన దేశంలో అది చట్టం కాజాలదు. ఒక్క వార్షిక బడ్జెటు, పన్నులకు సంబంధించిన ద్రవ్యబిల్లుల విషయంలో మాత్రం లోక్‌సభదే సర్వాధికారం. ఒకవేళ రాజ్యసభ దాన్ని ఆమోదించకపోయినా అది రాష్ట్రపతి ఆమోదంతో చట్టంగా రూపొందుతుంది. మిగిలిన అన్ని చట్టాల విషయంలో ఉభయసభలకూ సమానాధికారాలున్నాయి. ఒకవేళ ఒక సభ ఆమోదించినా రెండో సభ అంగీకరించకపోతే, ప్రభుత్వం సిఫార్సుపైన రాష్ట్రపతి ఉభయ సభల సంయుక్త సమావేశాన్ని రాజ్యాంగంలోని 108వ అధికరణ ద్వారా ఏర్పాటు చేయవచ్చు. సంయుక్త సమావేశంలో ఆ బిల్లు ఆమోదాన్ని పొందితే అది రాష్ట్రపతి సంతకంతో చట్టం అవుతుంది.

మనదేశంలో కాంగ్రెస్ 1977 వరకు కేంద్రంలోను, 1967 వరకు దాదాపు అన్ని రాష్ట్రాలలోనూ అధికారాన్ని చెలాయించింది. అందువల్ల పార్లమెంటు ఉభయసభలలో ఆ పార్టీకే స్పష్టమైన ఆధిక్యం ఉండటంతో చట్టాలు చేయటానికి ఏ అడ్డంకీ లేకుండా పోయింది. 1977 నుంచి ఉభయ సభల మధ్య ప్రతిష్ఠంభన ప్రారంభమైంది. అంతకుముందు రాజభరణాల రద్దు విషయంలో రాజ్యాంగ సవరణను రాజ్యసభ తిరస్కరించింది. ఆ తరువాత దాన్ని ఆమోదించగలిగారు. 1977లో జనతాపార్టీ అధికారంలోకి వచ్చింది. ఎమర్జెన్సీ వ్యతిరేక పవనాల వల్ల జనతా అధికారంలోకి వచ్చినా,

రాజ్యసభలో కాంగ్రెస్ పార్టీకి గతంలోని సంఖ్యాబలం కొనసాగటంతో చట్టాలు చేసే విషయంలో జనతా ప్రభుత్వానికి చాలా ప్రతిబంధకాలు ఎదురయ్యాయి. ప్రజలలో ఎమర్జెన్సీ నియంతృత్వ ధోరణుల పట్ల తీవ్ర వ్యతిరేకత వ్యక్తం కావటంతో ఎమర్జెన్సీ కాలంలో చేసిన దారుణమైన 42వ రాజ్యాంగ సవరణని మార్చటం, అలాగే 352వ అధికరణంలోని ఎమర్జెన్సీ విధింపునకు సంబంధించిన అంశాలను మార్చటం మాత్రం సాధ్యమయింది. ఎన్నికలలో ఓడిన కాంగ్రెస్ ఆ అంశాల వరకు సహకారాన్నిచ్చింది. మిగిలిన అన్ని చట్టాల విషయంలో రాజ్యసభ చూపిన ప్రతిఘటన వల్ల అడ్డంకులు ఎదురయ్యాయి. ఆనాటి నుంచి కాంగ్రెస్ అధికారంలో లేనప్పుడు ప్రతి ప్రభుత్వానికి రాజ్యసభ కారణంగా చట్టాలు చేయటం తలనొప్పిగా పరిణమించింది. 1977-79లో జనతా ప్రభుత్వం, 1989-90లో జనతాదళ్ ప్రభుత్వాలు, 1998 నుంచి బీజేపీ-ఎన్డీయే ప్రభుత్వాలకు చట్టాలు చేసే విషయంలో రాజ్యసభ వల్ల ఎన్నో చిక్కులు ఎదురయ్యాయి. 1996-98 మధ్య ఏర్పడ్డ యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వాలకు బయట నుంచి కాంగ్రెస్ మద్దతివ్వటంతో రాజ్యసభలో మద్దతు లభించింది. 1989లో లోక్‌సభలో అత్యధిక మెజారిటీతో ఉన్న రాజీవ్ గాంధీ ప్రభుత్వం, స్థానిక ప్రభుత్వాల ఏర్పాటు కోసం ప్రతిపాదించిన మంచి రాజ్యాంగ సవరణను కూడా ప్రతిపక్షాలు ఇలాగే అడ్డుకుని తిరస్కరించాయి. 53 సంవత్సరాల స్వతంత్రంలో కేవలం ఏడేళ్లు మాత్రమే ఇతర ప్రభుత్వాలు ఉండటంతో రాజ్యసభలో ఎప్పుడూ కాంగ్రెస్‌దే పైచేయి అయింది. మళ్లీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినా రాజ్యసభలో అప్పటికి ఇతర పక్షాల ఆధిక్యం పెరిగి, ప్రభుత్వం ఏ చట్టానికీ రాజ్యసభలో మద్దతు పొందలేకపోవచ్చు! ఇలా చట్టసభలు నిరర్థకమవుతున్నాయి. అనలీ సమస్యకారాజ్యసభ ఏర్పాటు చేసిన తీరు వల్ల ఉత్పన్నమవుతోంది. ప్రతి రెండేళ్లకు మూడోవంతు సభ్యులను రాష్ట్ర శాసనసభలు ఎన్నుకోవటంతో రాజ్యసభ ఏనాడూ ప్రజల అప్పటి అభిప్రాయాలను ప్రతిబింబించలేదు. గతానికి చెందిన అసెంబ్లీ సభ్యుల, పార్టీల అభిప్రాయాలకు మాత్రమే రాజ్యసభ ప్రాతినిధ్యం వహిస్తోంది. లోక్‌సభ ప్రత్యక్షంగా ప్రజలిచ్చిన మద్దతుతో ఎన్నికవుతుంది. చట్టాలు చేయటానికి లోక్‌సభకు రాష్ట్రాల శాసనసభల నుంచి గతంలో ఎన్నికయిన రాజ్యసభకు సమాన అధికారం ఉండటం వల్ల, ఉభయ సభల ఆమోదం లేనిదే చట్టం సాధ్యం కాకపోవటం వల్ల చిక్కులు వచ్చాయి. చట్టసభలు చట్టాలు చేయటం కోసం ఏర్పడ్డాయి. అయినా ప్రస్తుత పరిస్థితులలో చట్టాలు చేయటం అసాధ్యంగా మారుతోంది. గతించిన 12వ లోక్‌సభ జీవితకాలంలో (1998-99) ఈ కారణంగా ఒక్క చట్టం కూడా చేయటం సాధ్యం కాలేదు! కేవలం రెండు బడ్జెట్‌లను మాత్రం ఆమోదించగలిగారు. బడ్జెట్ ఆమోదం, పన్నుల బిల్లులు పూర్తిగా లోక్‌సభ పరిధిలోనివి కాబట్టి ఇది సాధ్యమయింది. అది కూడా 1999-2000 బడ్జెట్‌ను వాజపేయి ప్రభుత్వం పతనమయ్యాక రాష్ట్రపతి ఆదేశంతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి అన్ని పార్టీలు ఏకగ్రీవంగా ఆమోదించాయి!

**చట్టాలు చేయటానికి లోక్‌సభకు రాష్ట్రాల శాసనసభల నుంచి గతంలో ఎన్నికయిన రాజ్యసభకు సమాన అధికారం ఉండటం వల్ల, ఉభయ సభల ఆమోదం లేనిదే చట్టం సాధ్యం కాకపోవటం వల్ల చిక్కులు వచ్చాయి. చట్టసభలు చట్టాలు చేయటం కోసం ఏర్పడ్డాయి. అయినా ప్రస్తుత పరిస్థితులలో చట్టాలు చేయటం అసాధ్యంగా మారుతోంది. గతించిన 12వ లోక్‌సభ జీవితకాలంలో (1998-99) ఈ కారణంగా ఒక్క చట్టం కూడా చేయటం సాధ్యం కాలేదు!**

పార్టీ ఫిరాయింపు వ్యతిరేక చట్టం పేరుతో 52వ రాజ్యాంగ సవరణ చేశాక పరిస్థితి మరీ జటిలమై, 'అయ్యవారిని చేయబోతే కోతి' అయినట్లుగా మారింది. ప్రస్తుతం రాజ్యాంగంలోని 10వ షెడ్యూలు ప్రకారం ఒక పార్టీ విప్ జారీ చేస్తే, దాన్ని అతిక్రమించి ఓటు వేసే హక్కు సభ్యులకు లేదు. అలా విప్‌ను అతిక్రమిస్తే, రాజ్యసభ సభ్యులకు పదవీచ్యుతి కలుగుతుంది. ప్రస్తుతం తలెత్తుతున్న సంక్షోభాన్నే చూస్తే, రాజీవ్ గాంధీ పేరును బోఫోర్స్ ఛార్జిషీటులో ప్రస్తావించారనే కారణంతో రాజ్యసభలో ఏ బిల్లునూ అనుమతివ్వబోమని కాంగ్రెస్ పార్టీ మొరాయించింది. 245 మంది సభ్యులున్న రాజ్యసభలో అధికార బీజేపీ, మిత్రపక్షాలకు 74మంది సభ్యులుండగా, కాంగ్రెస్ మిత్రపక్షాలకు 82మంది సభ్యులున్నారు. కాంగ్రెస్ మద్దతు, లేదా వామపక్షాలు, బహుజన సమాజ్‌పార్టీ, సమాజ్‌వాది పార్టీ, రాష్ట్రీయ జనతాదళ్‌ల మద్దతు లేకుండా రాజ్యసభలో ఏ చట్టాన్నీ ఆమోదించటం సాధ్యం కాదు! ఉదాహరణకు కాంగ్రెస్ పార్టీ తన ఎన్నికల ప్రణాళికలో బీమా రంగాన్ని ప్రైవేటీకరిస్తామని హామీ ఇచ్చింది. అదే అంశంపై ప్రస్తుత ఎన్డీయే ప్రభుత్వం బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టింది. తమ పార్టీ ప్రతిపాదించిన అంశాన్నే చట్టంగా తెస్తే దాన్ని ఏ పరిస్థితుల్లోనూ

ఆమోదించబోమని కాంగ్రెస్ సభ్యులు ప్రతిజ్ఞలు చేస్తున్నారు! కారణం, దీనితో సంబంధం లేని రాజకీయ అంశం. 12 సంవత్సరాలుగా ప్రజల నోళ్లలో నానుతున్న బోఫోర్స్ కుంభకోణం ఓ కొలిక్కి వచ్చి ఇటీవలే ఛార్జిషీటు దాఖలైంది. అందులో రాజీవ్ గాంధీ పేరు చేర్చరాదని కాంగ్రెస్ వాదన. చట్టప్రకారం కుంభకోణంతో ప్రమేయమున్న వ్యక్తులందరి పేర్లు చేర్చాలని, మరణించిన కారణంగా రాజీవ్ గాంధీ మీద సహజంగానే కేసు ఉండదని ప్రభుత్వ వాదన. కేవలం తన భర్త పేరును ఛార్జిషీటులో చేర్చారన్న కారణంగా భారత పార్లమెంటును స్తంభింప చేయటానికి కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియా గాంధీ పూనుకున్నారు. బట్టతలకు మోకాలికీ లంకె పెట్టి, తన పార్టీ ప్రతిపాదించిన అంశాలతో సహా ఏ చట్టాన్నీ రాజ్యసభలో ఆమోదం కాకుండా అడ్డుకుంటామని ప్రకటించారు! కొద్దివారాల క్రితమే ఎన్నికయిన ప్రభుత్వం అచేతనంగా చూస్తుండటమే తప్ప చేసేదేమీ లేదు! ఇదీ మన పార్లమెంటరీ ప్రజాస్వామ్యం దుస్థితి!

### రాజ్యాంగ సవరణ అవసరం

అమెరికాలో కూడా చట్టాల విషయంలో ప్రతిష్ఠంభన ఏర్పడుతోంది. కానీ ఇందులో చాలా తేడాలున్నాయి. అమెరికా అధ్యక్ష తరహా ప్రజాస్వామ్యంలో చట్టసభలకు, అధ్యక్షుడికి మధ్య అధికారాల విభజన స్పష్టంగా ఉంది. ఈ రెండింటి మధ్య పోటీ ఉండాలన్న సంకల్పం అమెరికా రాజ్యాంగంలో వ్యక్తమయింది. ఆ దేశంలో ఉభయసభలను ప్రజలు ప్రత్యక్షంగా ఎన్నుకుంటారు. చట్టసభ సభ్యుల మీద 'విప్' అనేది ఉండదు. కాబట్టి సభ్యులు తమ అభిప్రాయాల మేరకు, ప్రజల అభీష్టం మేరకు ఓటు వేస్తారు. ఆ దేశంలో విప్ జారీ చేయటంగానీ, గుడ్డిగా పార్టీ చెప్పినట్టు ప్రతి సభ్యుడూ విధిగా ఓటు వేయడంగానీ అసాధ్యం. మన రాజ్యసభలోనే చట్టాల విషయంలో విప్ లేకుండా ఉంటే, ఎందరో కాంగ్రెస్ సభ్యులు ఇన్సూరెన్స్ బిల్లును ఆమోదిస్తారు. మాజీ ఆర్థికమంత్రి మన్మోహన్‌సింగ్ లాంటి వారు ఇలాంటి చట్టాలను పూర్తిగా సమర్థిస్తారు. కానీ ప్రస్తుతం ఆ అవకాశం లేదు. రాజ్యాంగ సవరణలు, రాష్ట్రాలకు హక్కులకు సంబంధించిన విషయాలలో తప్ప మిగిలిన చట్టాల అంశంలో రాజ్యసభ అధికారాలను కుదించాలి. తొందరపాటుతో ఏదైనా చట్టాన్ని లోక్‌సభ ఆమోదిస్తే దాన్ని కొంతకాలం పాటు ఆపటానికి, లోక్‌సభ పునరాలోచన చేయటానికి, దేశంలో చర్చ రేకెత్తించటానికి కొద్దికాలంపాటు బిల్లులను ఆపే అధికారం మాత్రమే రాజ్యసభకి ఉండాలి. అలాగే రాజ్యసభలో 'విప్' జారీ చేసే అవకాశం లేకుండా పార్టీ ఫిరాయింపు చట్టాన్ని సవరించాలి. ఎందుకనంటే రాజ్యసభలో, ఓటుకు ప్రభుత్వాల మనుగడకు సంబంధం లేదు. అలాకాక ఇప్పటి పరిస్థితే కొనసాగితే ప్రజల తీర్పునకు, పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి అర్థం ఉండదు. ఈ ప్రతిష్ఠంభన ఇలాగే కొనసాగితే, 13వ లోక్‌సభ కూడా ఏ చట్టాన్నీ చేయజాలదు. బ్రిటన్‌లో 1911లోలాగా ప్రజాభిప్రాయాన్ని కూడగట్టి ఎగువ సభ అధికారాలను పరిమితం చేయాలి. లేదా పతనమయిన ఈ పార్లమెంటరీ వ్యవస్థకు స్వస్తి చెప్పి స్పష్టమైన అధికారాల విభజన కోసం రాజ్యాంగ సవరణలు తేవాలి.

(జేపీ 'భవిష్యత్ భారతం' కాలమ్‌లో భాగంగా 1 నవంబర్, 1999న 'ఈనాడు'లో ప్రచురితమైన వ్యాసం) ❐

## వ్యవసాయం చేస్తున్న పాపానికి పేదరికం నుంచి బైటపడలేకపోతున్నారు

ప్రపంచవ్యాప్తంగా దాదాపు వంద కోట్ల మంది ఇంకా రోజుకు 1.25 డాలర్లతోనే జీవిస్తున్నారని ఐక్యరాజ్యసమితి వెల్లడించింది. జీవనం కోసం వ్యవసాయం మీద ఆధారపడిన గ్రామీణ ప్రాంత ప్రజలకు పేదరికం నుంచి బైట పడటం కష్టంగా ఉంది అని పేర్కొంది. ఈ సంఖ్యను తగ్గించటానికి సామాజిక చేయూత-పంట దిగుబడి పెంపు చర్యల మేళవింపు కీలకమని ఐరాసకు చెందిన ఆహార, వ్యవసాయ సంస్థ (ఎఫ్ఏవో) 'ఆహారం, వ్యవసాయ స్థితిగతులు' పేరుతో విడుదల చేసిన నివేదికలో పేర్కొంది. కడు పేదరికంలో మగ్గుతున్న వారి సంఖ్య గణనీయంగా తగ్గినా ప్రపంచవ్యాప్తంగా దయనీయ పరిస్థితులు కొనసాగుతున్నాయని తెలిపింది. 'పేదరికం, పోషకాహార లోపం ప్రపంచంలోని చాలా ప్రాంతాల్లో తీవ్రంగా ఉంది' అని పేర్కొంది. బ్రెజిల్, ఇథియోపియా, భారత్, మెక్సికో, దక్షిణాఫ్రికా దేశాల్లో కొన్ని సామాజిక కార్యక్రమాల వల్ల సత్ఫలితాలు వచ్చాయని తెలిపింది. పేదరికంపై పోరులో సామాజిక భద్రతా కార్యక్రమాలు కీలకం కాగలవని విశ్లేషించింది.

# మనం సద్వినియోగం చేసుకోలేకపోయిన 2015

ప్రపంచీకరణ ప్రభావం చాలా ప్రస్ఫుటంగా కనిపించిన సంవత్సరం 2015. ప్రధాని నరేంద్ర మోదీ విదేశీ పర్యటనలు, ఐఎస్ఐఎస్ దాడులు, సామాజిక మాధ్యమాలు, వాతావరణ మార్పులు, భారత్ పట్ల విదేశీ మదుపుదారుల ఆసక్తి వంటి కారణాల వల్ల మనదేశంలో పరిణామాలకు, ప్రపంచంలో కీలక పరిణామాలకు పెద్దగా అంతరం కనిపించదు. ఈ ఏడాది మనదేశం ఆర్థికరంగంలో గట్టి కృషే చేసింది. పెట్టుబడులను ఆకర్షించటానికి ప్రపంచ దేశాలలో కూడా మనకు సానుకూల వాతావరణాన్ని ఏర్పరిచింది. అయితే దేశీయంగా మాత్రం ప్రపంచీకరణకు తగ్గ స్థాయి స్థానికీకరణకు కావలసిన సంస్కరణల్ని తేవటంలో ఘోరంగా విఫలమైంది.

జడ్జీలను జడ్జీలే నియమించుకునే అప్రజాస్వామికమైన కొలీజియం వ్యవస్థ స్థానంలో వచ్చిన న్యాయనియామకాల చట్టం (ఎన్‌జేఏసీ)ని పార్లమెంటు ఆమోదించటంతో 2015 మొదలైంది. లోక్‌సత్తా చొరవతో వచ్చిన ఈ చట్టాన్ని ఆ తర్వాత పార్లమెంటుతోపాటు, 20 రాష్ట్రాల అసెంబ్లీలు స్వల్ప వ్యవధిలో ఆమోదించాయి. ఎంతో హేతుబద్ధంగా, ప్రపంచదేశాల అనుభవాల ఆధారంగా రూపొంది, పార్లమెంటు ఏకగ్రీవంగా ఆమోదించిన ఈ చట్టాన్ని సుప్రీంకోర్టు అప్రజాస్వామికంగా, రాజ్యాంగస్ఫూర్తికి విరుద్ధంగా కొట్టివేసింది. ఇదే తరహాలో వ్యవస్థల పతనం పలు విభాగాలలో కనిపించింది. ప్రణాళికా సంఘం స్థానంలో ప్రతిపాదించిన నీతి ఆయోగ్ ఎలా ఉంటుందో కూడా తెలియకుండా ఆ సంఘాన్ని రద్దుచేసేశారు. ఏడాది గడుస్తున్నా నీతి ఆయోగ్‌కు దిక్కు తోచటం లేదు. సహకార, సమాఖ్య వ్యవస్థ, స్వచ్ఛ భారత్ ఇలా అనేకం నినాదాలుగా ప్రాచుర్యం పొందాయి తప్ప వాటి అమలు ఎక్కడా వ్యవస్థీకృతం కాలేదు. కేంద్రం నుంచి రాష్ట్రాలకు పంచే నిధుల్ని భారీస్థాయిలో 42శాతానికి పెంచినా, అవి ప్రజలకు నిజంగా ఫలితాలనివ్వటానికి కావలసిన స్థానిక ప్రభుత్వాలను బలోపేతం చేసే దిశగా ఒక్క సంస్కరణ కూడా లేదు. గ్రామాలు, మునిసిపల్ వార్డులకు తలసరి రూ.1000-2000 నేరుగా జవాబుదారీతనంతో కేటాయించి ఉంటే ప్రజలకు ఎంతో ఊరట కలిగి పాలనలో క్రియాశీల భాగస్వాములై ఉండేవారు. మూడో అంచె పాలనను నిర్వీర్యం చేసి పాత కేంద్రీకృత పాలనవైపే మోదీ మొగ్గుచూపారు. చెన్నై వరదలైనా కనువిప్పు అవుతాయా?

ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు అవసరమైతే, ఆ దిశగా స్టార్టప్ లేదు. ప్రజలు ఎదగటానికి కావలసిన విద్య, ఆరోగ్యం గురించిన ఊసే లేదు. బడ్జెట్‌లో కూడా వాటికి అరకొర కేటాయింపులు. నరేంద్ర మోదీ ఒక పెద్ద ప్రజాస్వామ్యంలో ప్రజల ద్వారా ఎన్నికైన నేత కావటం, భారత్ ఒక పెద్ద యువ మార్కెట్ కావటం- ఇవి రెండే ప్రపంచ దేశాల్లో భారత్‌కు గుర్తింపునిస్తున్న ప్రధానాంశాలు. వీటికి తోడు ప్రవాస భారతీయులు రాణిస్తుండటం అదనపు శక్తినిస్తోంది. అయితే వీటి వల్ల ఫలితాలను సాధించేందుకు కావలసిన వ్యవస్థీకృత సంస్కరణల్ని, విద్య, ఆరోగ్యరంగాలను మోదీ ప్రభుత్వం పూర్తిగా విస్మరించింది.

ఇక సాంకేతిక వినియోగం మేర పారదర్శకత పెరిగిందికానీ, అవినీతి అంతానికి నిర్దిష్ట చర్యలు లేవు. లోక్‌సత్తా చొరవతోనే రద్దయిన 2 జీ స్పెక్ట్రం అక్రమ కేటాయింపుల కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు వల్ల బొగ్గు తదితర ప్రకృతి వనరుల కేటాయింపులో బహిరంగ వేలం విధానాన్ని మోదీ ప్రభుత్వం ప్రవేశపెట్టటం వల్ల ఈదేశానికి రూ.లక్షల కోట్ల ఆదాయం సమకూరింది. అయితే, ప్రభుత్వోద్యోగుల వ్యవస్థను ప్రక్షాళన చేసి పౌరుల చుట్టూ తిరిగే పాలనను అందించేందుకు తగిన ఏర్పాటు చేయాల్సిందిపోయి, అవినీతి ఉద్యోగులకు ఊతంగా నిలిచేలా అవినీతి నిరోధక చట్టంలో '17ఎ'ను చేర్చే ప్రతిపాదన చేసింది. లోక్‌పాల్, ఆర్‌టీఐలను బలోపేతం చేసే చర్యలు లేవు. తమిళనాడు ముఖ్యమంత్రి జయలలిత అక్రమాస్తుల కేసులో ఇచ్చిన తీర్పు న్యాయవ్యవస్థ పనితీరుపై అనుమానాలను రేకెత్తించింది. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఓటుకు కోట్లు కేసులో దోషిగా స్పష్టంగా తేలుతున్నా, రెండు రాష్ట్రాల మధ్య కేసులో సీబీఐ విచారణకు ఆదేశించే ప్రయత్నమే మోదీ చేయలేదు.

సమ్మిళిత అభివృద్ధిలో కీలకమైన సామాజిక సవాళ్లను ఎదుర్కోవటంలో మోదీ ప్రభుత్వం పేలవంగా వ్యవహరించింది. గుజ్జర్లు, పటేల్ వర్గం వంటి వారిలోనే కాకుండా, కులం ఆధారిత రిజర్వేషన్ల సమస్య అన్ని కులాల్లో రాజుకుంటూ విపరీత భావాలకు దారితీస్తోంది. ఆహారపు అలవాట్ల మీద, ఇతరత్రా అసహనాలు, దాడులు పెరుగుతున్నా కేంద్రప్రభుత్వం తగురీతిలో స్పందించలేకపోయింది. తమ సొంత పార్టీ వారే రోజుకో విద్వేష ప్రకటన చేస్తున్నా బీజేపీ ప్రధానమంత్రి నుంచి దీటైన జవాబు లేదు. పలు ఎన్‌కౌంటర్లు పోలీసు వ్యవస్థ చట్టబద్ధ పాలనను ప్రశ్నిస్తున్నాయి. మహిళలకు అండ కోసం ఏర్పాటు చేసిన నిర్భయ ఫండ్ ఇప్పటివరకూ ఖర్చు చేయలేదు. అలాగే భారత్‌కు సవాలు విసురుతున్న వాతావరణ మార్పులు, దేయిష్ ఉగ్రవాదం వంటి వాటిపై కూడా మోదీ ఇంకా 19వ శతాబ్దం విధానాలతోనే వ్యవహరిస్తున్న అమెరికా, బ్రిటన్ వంటి అభివృద్ధి చెందిన దేశాల మార్గం నుంచి బైటపడి ఆధునిక స్థాయి పరిష్కారాలను ఆచరించలేకపోతున్నారు. హిందూ, ఇస్లాం, క్రైస్తవ తేడా లేకుండా తాలిబనీకరణ వంటి వాటి నుంచి మతాల్ని ఆధునీకరించే చొరవ చేయలేకపోతున్నారు.

విదేశీ పర్యటనల తర్వాత రాష్ట్రాల్లో ఎన్నికల ప్రచారం మీద ప్రధాని ఎక్కువగా దృష్టి సారించారు. ఆయా అసెంబ్లీల ఎన్నికలలో మోదీ తన ప్రచారానికి సాంప్రదాయ రాజకీయ పార్టీల నేతలలాగే లెక్కలు చూపని కోట్ల రూపాయలు గుమ్మరించారని వార్తలు వినవస్తున్నాయి. ఇన్ని చేసినా ఆయన ఢిల్లీ, బీహార్‌లో ఘోరపరాజయాన్ని చవిచూశారు. కాంగ్రెస్ వంటి ప్రధాన పార్టీ పూర్తిగా కుదేలవటం సహా పలు కారణాలతో ఢిల్లీలో ఆమ్ ఆద్మీ పార్టీ ఘన విజయం సాధించింది. అవకాశం వస్తే కొత్త రాజకీయ పాలననే కోరుకుంటామని ఓటర్లు తేల్చిచెప్పారు. బీహార్‌లో లాలూ ప్రసాద్ సమస్యాత్మకమే అయినా, స్థానికంగా నిరూపించుకున్న నితీష్ కుమార్ పట్ల మొగ్గుచూపారు. ఇది 2014 ఎన్నికల సమయంలో ఆయన చేసిన ప్రచారానికి, ఇచ్చిన హామీలకు విరుద్ధమైనది. కార్మిక చట్టాల సవరణకు తగినంత చొరవ లేదు.

దేశ జనాభాలో మెజారిటీ ప్రజలు ఆధారపడిన వ్యవసాయరంగం తీవ్ర సంక్షోభంలో ఉండి రోజుకు 34 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్న వార్తల మధ్య కూడా ఏం చేయాలో మోదీకి ఇంకా స్పష్టమైన కార్యాచరణ లేదు.

ఇక తెలుగు రాష్ట్రాల విషయానికొస్తే, ఫిరాయింపులు, ఎన్‌కౌంటర్లు, ఓటుకు కోట్లు, రాజధాని పేరుతో భూసేకరణ, అసంబద్ధ సాగునీటి ప్రాజెక్టులు, వంశపారంపర్య పదవులు, భూస్వామ్య దానధర్మాలు, అట్టహాసాలతో పాత రాజకీయమే రాష్ట్ర విభజనను ఒక అవకాశంగా మలిచే కొత్త రాజకీయమే లేదు. తెలంగాణలో జలహారం, గ్రామజ్యోతి వంటి మంచి పథకాలున్నా పాలనకు హైదరాబాదే కేంద్రబిందువుగా కొనసాగుతుండగా, ఏపీలో అమరావతి చుట్టూ రియల్ ఎస్టేట్ రాజకీయం నడుస్తోంది.

ఎమర్జెన్సీకి 40 ఏళ్లు, రాజ్యాంగదినోత్సవం వంటి సందర్భాలలోనైనా మౌలికాంశాల గురించి పాలకులు మాట్లాడటం ఊరట కలిగించినా, అధికారంలో ఉన్నవారు కూడా వాటిని ఆచరించకపోవటం ఈ ఏడాది ప్రధాన వైఫల్యం. మూడో అంచె పాలన, వ్యవస్థల నిర్మాణానికి అవకాశాల్ని సద్వినియోగం చేసుకుని ఉంటే 2015 ఒక గొప్ప మలుపు అయి ఉండేది. ❒

# నిజమైన గొప్ప భారతీయుడ్ని కోల్పోయాం

## శరద్ జోషికి జేపీ కన్నీటి నివాళి



స్వతంత్ర భారతదేశంలోని నిజమైన గొప్ప వ్యక్తులలో శరద్ జోషి ఒకరని, ఆయన మరణంతో మన వ్యవసాయ, గ్రామీణ రంగాలకు న్యాయం కోసం పోరాటాల్లో ఒక అధ్యాయం ముగిసిందని లోక్‌సత్తా పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ సజల నయనాలతో నివాళులర్పించారు. ప్రభుత్వమే అన్నీ శాసించాలనుకునే అజ్ఞానపుటంధకారంలో రైతులకు ఆర్థిక స్వేచ్ఛతో న్యాయమైన ఆదాయం, పౌరులకు అవకాశాలు అనే కాగడాను వెలిగించి అసాధారణమైన ధైర్యసాహసాలు, ముందుచూపుతో శరద్‌జోషి జీవితకాలమంతా పోరాడారన్నారు.

వ్యవసాయం-గ్రామాల పట్ల అపారమైన మమకారం, వ్యక్తి స్వేచ్ఛ-పౌరుల హుందాతనం కోసం ప్రాణాలకు తెగించి పోరాటం చేసిన పటిమ, మానవ నైజాన్ని-ప్రపంచాన్ని అర్థం చేసుకున్న విజ్ఞత.. ఈ మూడూ శరద్ జోషి సొంతమని, అందుకే ఆయన ఈ దేశంలో కోట్లాదిమందిని ప్రభావితం చేయగలిగారని జేపీ అన్నారు.

‘‘అన్నిటికీ ప్రభుత్వ దయాదాక్షిణ్యాల మీద ఆధారపడేటువంటి కాలంలో రైతులు, అన్నిరంగాల ప్రజల ఆర్థిక స్వేచ్ఛ కోసం నడుంబిగించిన ధీరోదాత్తుడు శరద్ జోషి. అనుపమాన నాయకత్వాన్ని ఈ దేశానికి అందించిన మహనీయుడు. రైతుల అభ్యున్నతి, వ్యవసాయ రంగానికి ఆర్థిక స్వేచ్ఛ, గ్రామాల అభివృద్ధి ఈ మూడు అంశాల్లో వినూత్నమైన, ఆచరణసాధ్యమైన పంథాని మనదేశంలో ప్రజలకు చూపెట్టి ఆయన చిరస్మరణీయుడయ్యారు.

“వ్యక్తిగతంగా నా జీవితాన్ని ప్రభావితం చేసిన ముగ్గురు గొప్ప భారతీయుల్లో శరద్ జోషి ఒకరు. ఒక మనిషి గొప్పతనాన్ని అతడు పొందిన అధికారాన్ని, పదవుల్ని బట్టి కాకుండా అతను వెలిగించిన జ్ఞానదీపాల్ని బట్టి, ఉత్తేజపరిచిన వ్యక్తులను బట్టి మాత్రమే అంచనావేయాలి. దేశ ఆర్థిక, వ్యవసాయ, గ్రామీణ రంగాలపై శరద్ జోషి ఆలోచనలు, పోరాటాల ప్రభావం అనుపమానం. ఇంకో దేశంలో అయితే ఆయన ప్రధానమంత్రో, అంతకంటే ఎక్కువో అయ్యేవారు. మన లేకిసమాజం శరద్ జోషిని మహారాష్ట్రీయునిగా, బాహ్మణుడిగానే చూస్తూ పరిమితం చేసింది. దీనివల్ల ఆయన నిరంతరం ఆవేదన చెందితే, ఈ దేశం అపారంగా నష్టపోయింది.

“శరద్ జోషి అనుకున్న లక్ష్యాలు-గ్రామాల్లో ప్రగతి, రైతులకి పూర్తి ఆర్థిక స్వేచ్ఛ, జీవితంలో భద్రత, సామాన్య పౌరులకి ఎదిగే అవకాశాలు సాధించేవరకు ఆయన పోరాటాన్ని కొనసాగించాలి. ఒక గొప్ప మనిషికి, దేశప్రజల స్వతంత్ర జీవనం కోసం నిరంతరం తపించిన ఓ గొప్ప దార్శనికుడికి కన్నీటి వీడ్కోలు. శరద్ జోషి కృషి లక్షలాదిమంది యువతీయువకులను ప్రభావితం చేసి ఒక గొప్ప సమాజాన్ని నిర్మించేందుకు ఉద్యుక్తుల్ని చేయాలని కోరుకుంటున్నాను” అని జయప్రకాష్ నారాయణ్ అన్నారు. ❒

# హిజ్రాలకు రేషన్ కార్డులివ్వండి



విజయనగరం జిల్లావ్యాప్తంగా నివశిస్తున్న హిజ్రాలకు రేషన్ కార్డులు ఇవ్వాలని లోక్‌సత్తా పార్టీ ఆంధ్రప్రదేశ్ ప్రధాన కార్యదర్శి భీశెట్టి బాబ్జీ డిమాండ్ చేశారు. కలెక్టరేట్ ప్రజాదర్బార్‌లో ఈ మేరకు వినతిపత్రం అందించారు. గతంలో హిజ్రాలకు ఆధార్, ఓటరు కార్డులకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతించిందని, రేషన్ కార్డులకు మాత్రం అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. పౌరసరఫరాల అధికారులు స్పందించాలన్నారు. హిజ్రాల హక్కులపరిరక్షణకు కట్టుబడి ఉంటామన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు డి.మీనా, కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

# పని చేయనివారు, పార్టీలు ఫిరాయించిన వారు మళ్లీ వస్తున్నారు గుణపాఠం చెప్పండి: లోక్‌సత్తా




ఐదు సంవత్సరాలపాటు గ్రేటర్ హైదరాబాద్‌లో కార్పొరేటర్లుగా పనిచేసి ప్రజాధనాన్ని సొంత విలాసాల కోసం దుర్వినియోగం చేసిన నేతలు, ఒక పార్టీ పేరు మీద గెలిచి స్వార్థప్రయోజనాల కోసం అధికార తెరాసలోకి జంప్ చేసిన ఫిరాయింపుదారులు మళ్లీ ఓట్ల కోసం వస్తున్నారని లోక్‌సత్తా పార్టీ హైదరాబాదీలను హెచ్చరించింది. ఇలాంటి నేతలకు గుణపాఠం చెప్పాలని ప్రజలకు విజ్ఞప్తి చేసింది. బంగారు తెలంగాణ అంటూ కల్లబల్లి కబుర్లతో తెరాస ప్రభుత్వం కాలక్షేపం చేస్తోందన్నారు. లోక్‌సత్తా పార్టీ సీనియర్ నేత మునిపల్లి వెంకటేష్ నల్లకుంటలోని పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ, ఫీవర్ ఆసుపత్రిలో రోగుల సంఖ్య పెరుగుతున్నా వైద్యసౌకర్యాలు మాత్రం అంతంతమాత్రంగానే ఉన్నాయని అన్నారు. చదువు, ఆరోగ్యం, పారిశుద్ధ్యం, రోజువారీ అవసరాలు ఇవన్నీ నాణ్యతతో ప్రజలకు అందేలా చూడాల్సింది స్థానికంగా ఉండే కార్పొరేటర్లు, కమిటీలేనని, వీటి కోసం కొట్లాడే సత్తా స్థానిక ప్రభుత్వాల నాయకులకు లేకుండా పోయిందన్నారు. రొనాల్డ్ రాస్ వంటి గొప్ప అధికారుల కృషితో మొదలై వందేళ్ల ఉత్సవం జరుపుకున్న ఫీవర్ ఆసుపత్రిని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. లోక్‌సత్తా నాయకులు శ్రీనివాస్ నాయుడు, శ్రీనివాస్ రెడ్డి, శర్మ, రామన్న గౌడ్, తరుణ్ యాదవ్ తదితర నేతలు సమావేశంలో పాల్గొన్నారు. ❐





# ఇప్పటికీ నాణ్యమైన విద్యను అందించలేని దుస్థితి మనదేశానిది : జేపీ

విద్యార్థులు ఎంతమంది బడిలో పేర్లు నమోదు చేసుకున్నారో కాదు.. వారికి నాణ్యమైన విద్య ఎంతమేరకు అందుతోంది అన్నదే ముఖ్యమని లోక్‌సత్తా పార్టీ వ్యవస్థాపకులు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. నాణ్యమైన విద్యను అందించటం లక్ష్యంగా ప్రథమ్ సంస్థ ఇటీవల ప్రారంభించిన 'లక్షల్లో ఒకరు' కార్యక్రమంలో భాగంగా వివిధ స్వచ్ఛంద సంస్థలు, వలంటీర్లను ఉద్దేశించి రంగారెడ్డి జిల్లా పరిషత్తులో జేపీ మాట్లాడుతూ, పాఠశాల చదువు అభివృద్ధికి గత పదేళ్లలో సర్వశిక్షా అభియాన్ ద్వారా సుమారు రూ.5 లక్షల కోట్లు ఖర్చు చేశారన్నారు. అయినా ఇప్పటికీ నాణ్యమైన విద్య అందటం లేదన్నారు. ప్రపంచవ్యాప్తంగా 74 దేశాల మధ్య లెక్కలు, తర్కం, విశ్లేషణల్లో సర్వే నిర్వహిస్తే మన హైస్కూలు విద్యార్థులు 73 వ స్థానంలో ఉన్నారన్నారు. ప్రతి ఒక్కరూ లక్షల్లో ఒకరు కార్యక్రమంలో చేరి నాణ్యమైన విద్య కోసం కృషి చేయాలని జేపీ పిలుపునిచ్చారు. ప్రథమ్ కో ఫౌండర్, ట్రస్టీ ఫరీదా లంబా, నేషనల్ లీడర్‌షిప్ గ్రూప్ మెంబర్ బుర్రా సునీత మాట్లాడుతూ, ఇప్పటిదాకా దేశవ్యాప్తంగా 600 జిల్లాల్లో 18 వేల గ్రామాల్లో 63 లక్షల ప్రభుత్వ ప్రైవేటు పాఠశాల విద్యార్థుల చదువుల స్థాయిపై వార్షిక నివేదికల్ని అందించామని, ఇప్పుడు చదువును బాగుచేయటంపై దృష్టి సారించామని తెలిపారు. సరోజారాణి, దేవీప్రసాద్, పి. రాంబాబు, సీనియర్ పాత్రికేయుడు సోమసుందర్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.



Posting Date 22-12-2015
RNI.Reg. No. APTEL/2010/32219 Postal Reg. No. HD/1126/2013-15 Published on December 16th 2015




# మా పన్ను డబ్బుల్ని తిరిగిచ్చేయండి

చెన్నైలో దాదాపు శతాబ్దకాలంలో కనీవినీ ఎరుగని వర్షం కురిసినా ముఖ్యమంత్రి జయలలిత, ప్రతిపక్ష నేత కరుణానిధి, కొందరు సెలబ్రిటీలు నివశించే పోయెస్ గార్డెన్, గోపాలపురంలో సాధారణ పరిస్థితే ఉంది . ఎందుకంటే ఆ ప్రాంతాలు కొంత ఎత్తులో ఉన్నాయి. వాటికి వరద కాలువలు తదితర మౌలిక సదుపాయాలు భేషుగ్గా ఉన్నాయి. మిగిలిన ప్రాంతాల్లో మాత్రం ప్రజలు ప్రత్యక్ష నరకాన్ని చూశారు. స్థానిక పాలన సక్రమంగా లేకపోతే ముఖ్యమంత్రిగా ఎవరున్నా, ప్రధానమంత్రి ఎవరైనా ఉపయోగం ఉండదని చెన్నైవాసులకి అనుభవపూర్వకంగా అర్థమైంది. ప్రకృతి వైపరీత్యాలను ఆపలేకపోవచ్చు కానీ, నష్టాన్ని నివారించటం, విపత్తును సమర్థవంతంగా ఎదుర్కోవటంలో వైఫల్యానికి మాత్రం సరైన పరిపాలన లేకపోవటమే కారణం. కాబట్టి సరైన రోడ్లు, పారిశుధ్యం, వరద కాలువలు, మురుగు నీటి పారుదల వ్యవస్థలు లేకుండా చేసి ఇన్ని అవస్థల్లోకి నెట్టినందుకు గత ఐదేళ్ళుగా మేం కట్టిన ఆస్తి పన్నుల్ని తిరిగి ఇవ్వాలంటూ లోక్‌సత్తా పార్టీ తమిళనాడు విభాగం చేపట్టిన క్యాంపయిన్ పోస్టర్ ఇది. చెన్నై వరద బాధితులను ఆదుకునేందుకు స్థానిక లోక్‌సత్తా వలంటీర్లు సొంతగానూ, ప్రభుత్వంతో, వివిధ స్వచ్ఛంద సంస్థలతో సమన్వయంతోనూ చేతనైనంత సాయం చేస్తున్నారు. స్థానిక ప్రభుత్వాల ఎన్నికలలో సరైన విధానాలు, నిజాయతీ గలవారిని ఎన్నుకోవడం ఎంత అవసరమో అన్ని రాష్ట్రాలకీ చెన్నై ఒక గుణపాఠం.

| Book-Post<br>PRINTED MATTER<br><br>If not delivered please return to:<br><br>Lok Satta Times<br>Tulips Apartment,<br>6-3-655, Flat.No. 407,<br>Behind Civil Supplies Office,<br>Somajiguda<br>Hyderabad- 500082 | To, |
|---|---|

Edited, Printed & Published at Hyderabad by Dr. Jayaprakash Narayan, Flat No. B. 504, Pasha Court, Somajiguda, Hyderabad - 500 082, Printed at Kala Jyothi Process Pvt., Ltd., 1-1-60/5, RTC"X" Roads, Hyderabad